తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

# హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక

నవంబర్-2020 ₹20/-



నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీ
ఫలితాలు

20
మినీ హాస్య కథల
ప్రత్యేక సంచిక



కబుర్లాపి రావణబ్రహ్మగారు
పిలుస్తున్నారు రండి!!
రావణ బ్రహ్మానందం
యుగాలుగా ఈ వాయిదాల
తిరగలేక చస్తున్నా... నా కిడ్నాప్ కేసు
ఏదో ఒకటి తేల్చేయండి యువరానర్!!
ఎన్ని సార్లు లెక్కపెట్టినా
తొమ్మిదే ఉన్నాయి ప్రభూ!!
చూశారా తమ్ముళ్ళూ.. ఆయనకేమో
వజ్రాల కిరీటం..మనకేమో
ముళ్ళ కిరీటాలు !!
నా అభిప్రాయంతో ఒక తల
విభేదించినంత మాత్రాన
నా నిర్ణయం మార్చుకోలేను!!

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

సంపాదకులు: రాము.పి

నవంబర్-2020

18వ సంవత్సరం ✦ 197 వ సంచిక

*Publisher& Editor*- Ramu.P

*Full Pillar*- Bnim

*Well Wishers:*

Tanikella Bharani

Dr.Sudarsan

K.V.V.Satyanarayana

Mallik, Sanku

*D.T.P*

P. Ramalakshmi, 9440304993

*Perpetuals*

A.Dayakar, Ramakrishna,

Lepakshi, Bannu, Krishna

Bachi,Nagisetty, Nagraj, Venkat





ముఖచిత్రం:
చాందిని చౌదరి


సంవత్సర చందా
రూ.300/-

2 సంవత్సరాల చందా
రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

జీవిత చందా
రూ.5000/-లు



Editorial Office: **HASYANANDAM**

# 8-215/4, Near Ramalayam,

**Po:YERRABALEM-522 503,**

Mangalagiri Mandal, Guntur dist.

*Ph* : **9849630637**

email: **hasyanandam.mag@gmail.com**



**Hyderabad & Secunderabad Distributors:**

M.Panduranga, **Risingsun News Agency**

Abids, Hyderabad. Cell. 9666680857.


## హాయ్...హాస్యానందంగా...

**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... సన్నిహితులకు**
**దీపావళి శుభాకాంక్షలు.**

మనమందరం ఏదో ఓ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాం! అయితే ఆ పనులు చేస్తూ కొంతమంది మాత్రమే గుర్తింపు పొందుతారు. దానికి ప్రధాన కారణం- శ్రద్ధ...అంకితభావం!

వంట దగ్గర్నుంచి... డ్రైవింగ్ దాక వారి వారి నైపుణ్యంతోపాటు నిబద్ధత తోడైతే ఆ 'గుర్తింపు' వేరే విధంగా ఉంటుంది.

మనందరికీ పనులు చేయడానికి ఎవరి కుండే మార్గదర్శకాలు వారికుంటాయి... అయితే ఆ మార్గదర్శకాలకు లోబడే, శ్రద్ధగా పనులు చేస్తే ఆ పనులు మరింత రాణిస్తాయన్నది నిత్యసత్యం.

ముఖ్యంగా సృజనాత్మకతతో కూడిన పనులు మరింత అంకితభావంతో చేయాల్సివస్తుంది. శ్రద్ధతో పనులు చేస్తూంటే కొత్త కొత్త ఆలోచనలు వస్తూంటాయి...

ఆ కొత్తదనమే మనల్ని ముందు వరసలో నిలుచోపెడుతుంది.

మనం చేసే ఏ వృత్తినైనా దైవంగా భావించి, దాన్ని గౌరవించి, శ్రద్ధగా చేస్తే మన వృత్తిలో మనం రాణించడం తథ్యం!

అందరూ ఆనందంగా...
ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ...



Ramu.P

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

*Smile in every page Satisfaction in every smile*

**నవ్వుకు కారణం ఆనందం!**

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

## మినీ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు


| | | | |
|---|---|---|---|
| మొదటి బహుమతి- | నేటి భారతం! | - జొన్నలగడ్డ రామలక్ష్మి | -10 |
| రెండవ బహుమతి- | పరిష్కారం! | -యం. రమేష్ కుమార్ | -12 |
| మూడవ బహుమతి- | వస్తువులు-శిల్పాలు | - డాక్టర్ ఎమ్.సుగుణరావు | -14 |
| ప్రత్యేక బహుమతులు- | | | |
| | అరచేతిలో స్వర్గం | -చొక్కాపు లక్ష్మునాయుడు | -16 |
| | నాకు పేరు పెట్టరూ | -పోతుబరి వెంకటరమణ | -18 |
| | అనుకున్నదొక్కటి | -కట్టా రాంబాబు | -20 |
| | ఓ చుప్పనాతి కథ | -గంగాధర్ వడ్లమన్నాటి | -22 |
| | ఇస్తినమ్మ వాయినం | -ఉప్పల పద్మ | -24 |
| | షరతులు వర్తిస్తాయి | -బలభద్రపాత్రుని ఉదయశంకర్ | -28 |
| | దెయ్యాల పండుగ | -దేశరాజు | -30 |
| | కుందన | -శింగరాజు శ్రీనివాసరావు | -32 |
| | నల్లకోడి | -డి. మధుసూధనరెడ్డి | -34 |
| | కోతానంతం | -భాగవతుల భారతి | -36 |
| | కోవిడ్ ఫోబియా | -ఇంద్రగంటి నరసింహమూర్తి | -38 |
| | 'నేము' లోనే(ప్రే)ముంది? | -కలవల గిరిజారాణి | -40 |
| | భౌ....భౌ... | -ఆదోని భాషా | -42 |
| | బిరుదోపాఖ్యానం | -కిలపర్తి దాలినాయుడు | -44 |
| | గుణపాఠం! | - కె. వి.లక్ష్మణరావు | -46 |
| | జిందాబాద్...జిందాబాద్ | -ఈత కోట సుబ్బారావు | -48 |
| | వినకు...వినకు... | -కోనే నాగ వెంకట ఆంజనేయులు | -50 |




కథలకు బొమ్మలు - చైతన్య

**ఈ సంచికలో కార్టూనిస్టులు**

- ✦ జయదేవ్
- ✦ సరసి
- ✦ గోపాలకృష్ణ
- ✦ లేపాక్షి
- ✦ బాచి
- ✦ బన్ను
- ✦ రామశర్మ
- ✦ రామ్‌శేషు
- ✦ గాంధి
- ✦ నాగిశెట్టి
- ✦ నాగ్రాజ్
- ✦ కృష్ణ
- ✦ వనజశ్రీ
- ✦ సాయికృష్ణ
- ✦ కామేష్
- ✦ ఆదినారాయణరావు
- ✦ చక్రవర్తి
- ✦ శ్రీ
- ✦ తోపల్లి ఆనంద్
- ✦ మోహన్ కుమార్
- ✦ టి.ఆర్.బాబు
- ✦ రవిశర్మ
- ✦ దాస్
- ✦ కందికట్ల
- ✦ కాశ్యప్
- ✦ నాథ్
- ✦ దొరశ్రీ
- ✦ ఎమ్.ఎ.రవూఫ్
- ✦ నూతి
- ✦ నెమలికొండ
- ✦ శేషు

### ఈ నెల ప్రత్యేకం


**ఫన్‌పంచ్**- ప్రఖ్యాత రచయిత శ్రీమల్లాది వెంకటకృష్ణమూర్తి **ఫన్** ప్రశ్నలకు డా॥సుదర్శన్ **పంచ్** సమాధానాలు **-26**

నాలుగు రీతులు... ఒకే సబ్జెక్ట్... నాలుగు కార్టూన్లు! **-డా॥ జయదేవ్ -52**

హేపీ బర్త్ డే రాంపా...మినీ ఇంటర్వ్యూ **-53**

| కార్టూన్ శీర్షికలు... | | | | | |
|---|---|---|---|---|---|
| రావణబ్రహ్మానందం | -2 | టింకు | -15 | సైలెంట్ స్టైల్ | -31 |
| ప్రోత్సాహక బహుమతులు | -5 | అదన్నమాట | -17 | ఆఫీస్ టూన్ | -33 |
| నవ్వులబడి | -6 | కింకారావం | -19 | మిస్టర్ కాక్ | -35 |
| శంకర్‌గారి రేఖాశీస్సులు | -8 | రాజాధిరాజరాజమార్తాండ | -23 | సినీటూన్ | -35 |
| నవ్వే ఆనందం | -11 | ఫ్యూచర్ పంచ్ | -25 | లాఫింగ్‌పిల్ | -36 |
| లబోదిబోలు | -13 | మన జనాలు | -29 | ఈతరం కోడలు | -41 |
| | | చిత్రహాసం | -29 | ది బెస్ట్ కార్టూన్ | -56 |


**గమనిక:**
మినీ హాస్య కథల పోటీలో గెలుపొందిన **20 కథలు** ఈ సంచికలో ప్రచురించడం వలన రెగ్యులర్‌గా వచ్చే సీరియల్స్, శీర్షికలు స్థలాభావం వలన ప్రచురించబడలేదు.
-సం॥

# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు





కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం**
కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-**
**ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి 1000 రూపాయలు& ప్రశంసాపత్రం**
**శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు**
అందజేస్తున్నారు.



ఈ నెల పురస్కార గ్రహీత **-హరగోపాల్**

## ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్! / బహుమతి: రూ.1000/-

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
**కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి
**ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.



కార్టూన్ 56 వ పేజీలో

ఈ నెల బెస్ట్ కార్టూనిస్ట్- శ్రీ




కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్.
**(జె. శ్రీరామచంద్రమూర్తి గారు)**
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని**
హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి
ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500**
**రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**

ఈనెల బహుమతి పొందిన కార్టూన్






✦ **ఆర్.మీనాక్షి, ముంబై**


అక్టోబర్ హాస్యానందంలో ప్రచురించన పదహారు మిఠాయిల నోము కథ చాలా బాగుంది. మనకి ఒక జబ్బు రాగానే ఎవరు ఏం చెబితే అవి పాటించి ఎలా ఇబ్బందులు పడ్తామో కథలో రచయిత్రి చెప్పిన విధానం బాగుంది. ఇక సీనియర్ రచయిత కృష్ణగారి ముఖా ముఖీ చదవటం వలన కృషి మనల్ని ఎంతటి ఉన్నత స్థితికి తీసుకెళుతుందో తెలుసుకున్నాను. థాంక్స్!

✦ **బి.ఎస్.మనోజ్, విశాఖపట్టణం**

హాస్యానందం అక్టోబర్ సంచికలో ప్రచురించిన కథలు బావున్నాయి. ముఖ్యంగా మనవరాలితో మూడు వారాలు-కథ నేడు చిన్నపిల్లలు తల్లులకు ఎంతా భయపడుతున్నారో కళ్ళకట్టినట్లు చూపించారు. రచయిత్రికి అభినందనలు. ఇక మధ్య పేజీలో సుదర్శన్‌గారి పంచ్ సమాధానాలు కొన్ని ఎంతగా నవ్విస్తున్నాయో...మరికొన్ని అంతగా ఆలోచింప జేస్తున్నాయి. నిజంగా సెంటర్ అట్రాక్షన్! కార్టూన్లు అన్నీ బావుంటుయ న్నాయి. మా పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పత్రిక నిర్వహకులకు అభినందనలు.

✦ **పి.రాజేశ్వరి, రాజమండ్రి**

మినీ కథాచక్రవర్తి శ్రీ కృష్ణగారి ముఖాముఖి చాలా బావుంది. స్వయంకృషితో కథల ప్రపంచంలో తనకంటూ ఓ స్థానం సంపాదించు కున్న కృష్ణగారికి అభినందనలు. మల్లాదిగారి సీరియల్ సూపర్. ఈ నెలలో ప్రచురించిన 'సెంటర్ అట్రాక్షన్' అట్రాక్టివ్‌గా ఉంది.




✦ **కె.నీరజా, హైదరాబాద్**

కరోనాని జయించిన సందడి' బావుంది. తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం కాస్త ఆలస్యంగా జరిగినా... మేము పాల్గొనకపోయినా విశేషాలు తెలుసుకున్నాం. 'హాయ్ సానందంగా...' లో ఎడిటర్‌గారు చెప్పిన 'ఎదుటివాళ్ళు చెప్పినవి విని... అందులో మంచి చెడు లను ఆలోచించి, నిజానిజాలు తెలుసుకుని ఆచరిం చడం తెలివైన లక్షణం అనిపించుకుంటుంది.' అన్న మాటలు చాలా బాగున్నాయి. చాలామంది ఎదుటి వాళ్ళు మాట్లాడుతుంటే మధ్యలో దూరి మాట్లాడేస్తుం టారు- వాళ్ళకే అన్నీ తెలుసన్నట్లు... అలా చేస్తే చాలా కోపం వస్తుంటుంది. మీకు మరొక్కసారి అభినందనలు.

✦ **ఎమ్.గోపాలకృష్ణ, రాజమండ్రి**

అక్టోబర్ హాస్యానందంలో ప్రచురించిన తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం విశేషాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా డాక్టర్ కె.వి.రమణాచారిగారు 'హాస్యానందం జీవిత చందా' ప్రకటించటం గ్రేట్! అలాగే ప్రఖ్యాత రచయిత శ్రీయండమూరి వీరేంద్ర నాథ్‌గారు హాస్యానందం వేదికగా కార్టూన్ పోటీ నిర్వహించటం మరో గొప్ప సంఘటన. పత్రికపట్ల మీ కృషి, శ్రద్ధ ప్రతి పేజీలోనూ ప్రస్పుట మౌతుంటుంది... ఇంటిల్లీపాది చదివేటట్లు కథలు, కార్టూన్లు ప్రచురి స్తున్న మీ ప్లానింగ్ గొప్పది. ఇలా మా ప్రియమైన పత్రిక హాస్యానందం ఎన్నో విజయాలు సాధించాలని కోరుకుంటూ... నా అభినందనలు తెలుపుకుంటున్నాను.



ప్రఖ్యాత రచయిత

## శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారు

నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ



న్యాయ నిర్ణేతలచే ఎంపిక చేయబడిన ఆరు కార్టూన్లు డిశంబర్ సంచికలో ప్రచురించబడతాయి. వీటిలో ఎక్కువమంది పాఠకులు మెచ్చిన కార్టూన్‌కి **5,000 రూపాయలు**, మిగిలిన 5 కార్టూన్లకి (ఒకోదానికి) **1,000 రూపాయలు** చొప్పున బహుమతి ఇవ్వబడుతుంది.

మొత్తం 10,000 రూపాయలు నగదు పారితోషికం శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారు అందజేస్తారు.

**నిబంధనలు:**

- ఒకోక్కరు ఒక కార్టూన్ మాత్రమే పంపాలి!
- కార్టూన్ మీద సంతకం చేయకుండా మరో పేపర్ పై సంతకం చేసి పంపాలి!

కార్టూన్ చేరాల్సిన ఆఖరి తేదీ:
నవంబర్,10,2020

కార్టూన్ ఈ మెయిల్‌కి పంపండి-
hasyanandampoteelu@gmail.com

హాస్యానందం సౌజన్యంతో

ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం (14,నవంబర్) సందర్భంగా

రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ & డాక్టర్స్ స్మైల్ క్లబ్, గుంటూరు వారు నిర్వహిస్తున్న

# చక్కెర 'కేళి'

## పేరడీ పాటల పోటీలు

(తెలుగు సినిమా పాటలు మాత్రమే)

**ఒకో పాటకి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు.**

*నిబంధనలు:*

- ***అంశం- షుగర్ వ్యాధి గురించే అయ్యుండాలి!***
- *షుగర్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు, వచ్చిన తరువాత జాగ్రత్తలు సూచిస్తూ పాటలు రాయండి.*
- *పేషేంట్లను కించపరిచేటట్లు, భయపెట్టేటట్లు పాటలు ఉండకూడదు.*
- *ఆరోగ్యంగా ఉండేట్లు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉత్సాహ పరిచేటట్లు పాటలు ఉండాలి.*
- *మీరు రాసిన పాటకు ఒరిజినల్ పాట మీరు గానీ మీ వాళ్ళెవరిచేతనైనా పాడి(ంచి) వాట్సాప్‌కు గానీ (9849630637), మెయిల్‌కు గానీ పంపండి!*

పాటలు మాకు చేరాల్సిన **ఆఖరు తేదీ:**
***డిశంబర్,1, 2020.***

పాటలు ఈ మెయిల్‌కి పంపవలెను.
hasyanandampoteelu@gmail.com

*With best compliments from*

Dr.V.V.Rama Kumar,
**S.V.R. Diabetes Care & Research Centre**
Kothapeta, Guntur-522 001


Happy Birthday

# Shankar గారి రేఖాశీస్సులు

**'నవంబర్'** లో పుట్టిన కార్టూనిస్ట్ మిత్రులందరికీ
**జన్మదిన శుభాకాంక్షలు.** -హాస్యానందం



జకీర్-నవంబర్, 1



కుంచెమురళి-నవంబర్,2




వెంకీ-నవంబర్,10



అంతోటి ప్రభాకర్-నవంబర్,12




గీతాసుబ్బారావు-నవంబర్,14




శ్యాంమోహన్-నవంబర్,19




భువన్-నవంబర్,23



సుధామ-నవంబర్,25



అరుణ్-నవంబర్,26



రాంపా-నవంబర్,29

(అక్షజ్ఞవారి 'మన కార్టూనిస్టుల రూపురేఖలు' సౌజన్యంతో)

# శ్రీ దండెంరాజు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన మినీ హాస్య కథల పోటీ ఫలితాలు

శ్రీదండెంరాజు ఫౌండేషన్ హాస్యానందంతో కలిసి నిర్వహించిన మినీ హాస్యకథల పోటీలో పాల్గొన్న రచయి(త్రు)తలకు అభినందనలు. సీనియర్ రచయితలను ఎప్పటికప్పుడూ ఉత్సాహపరచాలనీ... కొత్త రచయితలను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ఈ పోటీలు నిర్వహించడమైనది.

బహుమతులు గెలవకపోయినా పాల్గొన్నవాళ్ళందరూ విజేతలే!

రచయితలందరూ ఎప్పుడూ పోటీల్లో పాల్గొవాలనీ ఆశిస్తూ... శుభాకాంక్షలు.

**–డా॥డి.ఎన్.వి.రామశర్మ, వ్యవస్థాపక నిర్వాహకులు,**
**శ్రీదండెంరాజు ఫౌండేషన్, బెంగళూరు**

శ్రీదండెంరాజు ఫౌండేషన్ స్థాపక నిర్వాహకులు డా॥ డి.ఎన్.వి. రామశర్మగారు, హాస్యానందం వేదికగా నిర్వహించిన మినీ హాస్యకథల పోటీకి అనూహ్య ఆదరణ లభించింది.

ఈ పోటీని విజయవంతం చేసిన మన రచయితలకు, రచయిత్రులకు మా కృతజ్ఞతలు. విజేతలకు అభినందనలు.

శ్రీదండెంరాజు ఫౌండేషన్ చేస్తున్న సాహితీసేవకుగాను ముందుగా డా॥డి.ఎన్.వి.రామశర్మగారికి మా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు.

ఈ పోటీకి 250పైగా ఎంట్రీలొచ్చాయి. మేము ప్రకటించింది 15 కథలకు బహుమతులే. ఎంట్రీలు ఎక్కువ రావటం మూలాన మరో 5 ప్రత్యేక బహుమతులు కూడా ప్రకటించాం.

ఇంచుమించు అన్ని కథలు బావున్నాయి... అయితే **'మినీ హాస్య కథలు'– నిబంధనలకు** లోబడి పెద్ద కథలను, జుగుప్సాకరమైన హాస్యం, శృతిమించిన శృంగారం ఉన్న కథలు పరిగణలోకి తీసుకోలేదు. ఈ కథల ఎంపికలో ఎలాంటి వ్యక్తిగత ప్రభావం ఉండకూడదని, పత్రిక ప్రపంచానికి సంబంధం లేని సాహితీప్రియులైన కొంతమంది ఈ ఎంపిక ప్రకియలో పాల్గొన్నారు.

ముఖ్యంగా దీనికోసం శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు కేటాయించిన సమయం, ఓర్పు, సహనానికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఎంపిక ప్రక్రియలో– సమకాలీన సమస్య, దురాలవాట్లు, నేటిజీవనవిధానం... ఇలా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని బహుమతులను నిర్ణయించడమైనది.

పత్రికాపరంగా పోటీ నిర్వహించాము కాబట్టి పత్రికలోనే రిజల్ట్ కూడా ప్రకటించటం పరిపాటి. చాలామంది మిత్రులు 'సోషల్ మీడియాలో ప్రకటించండి' అని విన్నవించుకున్నారు. అయితే పత్రిక విడుదలయిన తరువాత, ప్రకటిస్తామని చెప్పటం జరిగింది. బహుమతి గ్రహీతలకు వ్యక్తిగతంగా తెలియజేశాం. మిగతావాళ్ళకు తెలియచేయడం ఆచరణ సాధ్యం కాని పని. (ఎక్కడైనా విజేతలనే ప్రకటిస్తారు).

**మరో ముఖ్యమైన సంగతి బహుమతి పొందని కథలు సాధారణ ప్రచురణగా స్వీకరించలేదు.**

చివరగా ఒక మాట ఈ కథల పోటీ నిర్వహణ, ఫలితాల వెల్లడి నిష్పక్షపాతంగా నిర్వహించాము.

దీనిపై ఎటువంటి వాదోపవాదాలకు తావులేదు. **–సంపాదకులు**

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీల్లో మొదటి బహుమతి పొందిన కథ

# నేటి భారతం!



జొన్నలగడ్డ రామలక్ష్మి
9885620065




**నా**టి భారతంలోని శకుంతల ప్రేమకథ నేటి భారతంలో రిపీటయింది.

ఈ శకుంతల కూడా అనాథ.

ఆమెను గొప్పింటి రాజు ప్రేమించాడు. ఐతే ఈమె స్వయంనిర్ణయం తీసుకోలేదు. తనుండే అనాథాశ్రమాన్ని నిర్వహించే పెద్దమనిషి మహర్షికి అన్నీ ముందే చెప్పుకుని, ఆయన రాజుకి యోగ్యతాపత్రం ఇచ్చేకనే పెళ్ళికొప్పుకుంది. ఆమెను పెళ్ళాడ్డానికి రాజు తన పెద్దల్ని వదులుకున్నాడు. ఆర్నెల్ల కాపురం తర్వాత దూరంగా వెళ్ళి ఆమెని మర్చిపోయాడు.

పెళ్ళయిన మూణ్ణెల్లలో రాజు జాతకం తిరిగింది. ఫాక్షన్ గొడవల్లో చిక్కుకున్న ఓ పెద్ద రాజకీయ నాయకుణ్ణి ప్రాణాలకు తెగించి కాపాడాడు.

కృతజ్ఞతగా ఆయన రాజుని వెంటనే తన పార్టీలో చేర్చుకుని... టికెట్ కూడా ఇచ్చాడు. అదృష్టం. ఎన్నికల్లో రాజు తన నియోజకవర్గం నించి రికార్డు మెజారిటీతో నెగ్గాడు. మూణ్ణెల్ల క్రితం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసాడు.

మకాం రాజుధానికి మారింది.

శకుంతల్ని మరిచాడు. ఆమె స్వయంగా ఫోన్ చేస్తే... ఎవరో తెలియదన్నాడు.

మహర్షి ఫోన్ చేస్తే... ఆయనా తనకి తెలియదన్నాడు.

"మీ మాట నమ్మి రాజుతో పెళ్ళికి ఒప్పుకున్నాను. ఇలా రాజకీయాల మత్తులో పడి, అధికారం తలెక్కి నాకు ద్రోహం చేస్తాడనుకోలేదు. అనాథని. అతణ్ణెదిరించే శక్తి లేదు. మీరే ఏదో చెయ్యాలి." అంది శకుంతల దీనంగా.

ఆమె ఇప్పుడు మూణ్ణెల్ల గర్భవతి.

"అమ్మా! నిన్ను నీవు నిరూపించుకుందుకు, నీ గర్భాన వున్న శిశువు డిఎన్ఏ చాలు. కానీ అతణ్ణి అల్లరి పెట్టడం నాకిష్టం లేదు. ఎందుకంటే రాజు మోసగాడు కాదు. కాలేదు. అలనాడు దుష్యంతుడివంటి సన్మార్గుడే ప్రియురాల్ని కాదన్నాడు దూర్వాసుడి శాపం వల్ల... పదవి, అధికారం ఉన్నవారిపై ఆ శాపం ప్రభావం నేటికీ




కనపడుతోంది. నామీద నమ్మకముంచు. మా అబ్బాయి శంకర్ని తోడుగా తీసుకుని రాజధానికి వెళ్ళి నీ భర్తని కలుసుకో. అవసరమైతే వాడేందుకు శాపవిమోచనానికి తగిన గుర్తు వాడికిస్తాను." అన్నాడు.

శకుంతల, శంకర్ రాజధానికి బయల్దేరారు.

వెళ్ళేముందు మహర్షి కొడుకుతో–

"సమయం చూసి రాజు మొబైల్‌కి మనం సిద్ధం చేసిన అలర్ట్ పంపు. కథ సుఖాంతమౌతుంది." అన్నాడు.

వాళ్ళు వెళ్ళిన సమయానికి రాజు అనుచరులతో సమాలోచనలో ఉన్నాడు.

అతడు శకుంతలని కానీ, శంకర్ని కానీ, గుర్తు పట్టక... అపరిచితుల్ని చూసినట్లు చూసాడు. ఏం మాట్లాడాలో తెలియక శకుంతల హతాశురాలయింది.

పరిస్థితి అర్థమైన శంకర్ వెంటనే తండ్రి చెప్పిన విధంగా మొబైల్నించి అలర్ట్ పంపాడు.

రాజు చటుక్కున తన మొబైల్లో అలర్ట్ చూసుకుని ఉలిక్కిపడ్డాడు.

అంతలో శకుంతలని చూసి– "అరే శకూ! ఎప్పుడొచ్చావ్?" అని ప్రేమగా పలకరించి లేచి నిలబడ్డాడు.

శంకర్ని కూడా గుర్తుపట్టి–

"మహర్షి, ఊళ్ళో మరికొందరి యోగక్షేమాలు విచారించాడు.

శకుంతల కథ సుఖాంతమైంది.

శంకర్ అక్కణ్ణించి బైటకొచ్చి తండ్రికి ఫోన్ చేసి–

"అంతా నువ్వన్నట్లే జరిగింది నాన్నా! ఎన్నికల్లో నెగ్గినవారు తమ నియోజకవర్గం ప్రజల్ని పూర్తిగా మర్చిపోతారన్న దూర్వాసుడి శాపం లేకపోతే... పాపం! రాజు శకుంతల్ని మరిచేవాడే కాదు. రెణ్ణెల్లలో జమిలి ఎన్నికలొస్తాయని నేను న్యూస్ అలర్ట్ పంపగానే అతడికి, శకుంతలే కాదు, మొత్తం మన నియోజకవర్గం వాళ్ళంతా గుర్తుకొచ్చారు." అన్నాడు.


**హెచ్చరిక/సందేశం:** భర్త నియోజక వర్గంలో కనుక పుట్టిల్లుంటే, అతడు అధికారంలో ఉండగా భార్య పుట్టింటికి వెళ్ళకూడదు. భార్య నియోజకవర్గంలో కనుక స్వంతిల్లుంటే, ఆమె అధికారంలో ఉండగా, భర్త తనవాళ్ళని కలవడానికి కూడా అటు వెళ్ళకూడదు.

తమ నాయకుడు తమని మర్చిపోతే, ఆ నియోజకవర్గం వారు అపార్థం చేసుకోకూడదు.

అతగాడికి దూర్వాసుడి శాపం నుంచి విమోచనం కలగాలని ప్రార్థనలు చెయ్యాలి.

సర్వేజనాస్సుఖినోభవంతు.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# పరిష్కారం!



యం. రమేష్ కుమార్
83095 54170




"ఈమధ్య ఏమిటో తెలీని ఆందోళన, ఆదుర్దాగా వుంటోందిరా... కారణం తెలీడం లేదు." మిత్రుడు సోమసుందరంతో ఫోన్లో మాట్లాడుతూ చెప్పాడు ఆనందరావు.

హైస్కూలు హెడ్మాష్టర్గా ఈ మధ్యనే పదవీ విరమణ చేశాడు ఆనందరావు.

అతని బాల్యమిత్రుడు సోమసుందరం డాక్టర్గా ఇప్పటికీ మంచి ప్రాక్టీస్ చేస్తున్నాడు.

"ఎందుకురా ఆందోళన! పిల్లలు సెటిలయ్యారు. చక్కగా రిటైర్మెంట్ జీవితం గడుపుతున్నావు. ఇంకెందుకు ఆందోళన? కొంపదీసి కోవిడ్ లక్షణా లేమన్నా ఉన్నాయా ఏమిటి?" నవ్వుతూ అడిగాడు సోమసుందరం.

"అబ్బే... అలాంటిదేం లేదురా! ఏదో ఆందోళన... గుండె దడ... రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టక పోవడం..."

"సరే! క్లినిక్ కట్టేసి వచ్చేటప్పుడు అలా మీ ఇంటికొచ్చి ఓసారి చెక్ చేస్తాన్లే!" చెప్పాడు సోమసుందరం.

ఆ సాయంత్రం ఆనందరావుని చెక్ చేస్తూ హార్ట్ బీటు... బి.పి... అదీ చూశాడు.

"అరె! బి.పి. ఎక్కువగా వుందిరా! అసలు ఏనాడూ జ్వరం, జలుబు అనేవాడివి కాదు. బి.పి. షుగర్లు కూడా ఎప్పుడూ లేవు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తావు. ఇప్పుడేమిటి ఈ ఆందోళన? అసలు రిటైరయ్యాక ఉదయం నుంచీ ఏం చేస్తున్నావు? నీ డైలీ కార్యక్రమమేమిటో వివరంగా నాకు చెప్పు!" అడిగాడు సోమసుందరం.

'ఏవుంది.? ఈ కోవిడ్ మూలంగా బైటికి ఎటెళ్ల డానికీ లేదు కదా! మా ఆవిడకి వంటలో సాయం చేస్తున్నాను. ఆవిడ మాటలు ఎక్కువగా వింటున్నాను... అదేమన్నా ఆందోళనకు కారణమంటావా!?

"నీ మొహం! ఉదయం నుంచీ నీ డైలీ రొటీన్ ఎలా వుంటుందో అది చెప్పు..." అడిగాడు సోమసుందరం.

ఆనందరావు ఉదయం లేచిందగ్గర్నుంచీ ఎలా గడుపుతున్నాడో వివరంగా చెప్పాడు.

"ఓహ్! అర్థమైంది!!... నేను చెప్పినట్టుగా పాటించు... నీ ఆందోళన ఎగిరిపోతుంది!" అని ఏం చెయ్యాలో చెప్పాడు సోమసుందరం.

అలా చేసిన ఐదారు రోజుల్లోనే ఆనందరావు ఆందోళన తగ్గడమే కాక... బి.పి. నార్మల్ కొచ్చింది.

సోమసుందరం తన భార్య విశాలాక్షితో ఈ విషయం గురించి చెప్తూ-

"వాడి ఆందోళననీ, బి.పి.నీ అలా ఏ మందులూ లేకుండానే చిటికెలో తగ్గించాను తెలుసా?..." కాస్త గర్వంగా చెప్పాడు.

"అసలింతకీ మీరు ఏం సలహా చెప్పి తగ్గించారు? అది చెప్పండి ముందు!" ఆసక్తిగా అడిగింది విశాలాక్షి


"సింపుల్! వాడికి మొదట్నుంచీ పేపర్ పూర్తిగా చదవడం అలవాటు. స్కూల్ ఉన్నప్పుడైతే కాస్త అలా అలా చదివి టైము చాలక పోవడం వల్ల వదిలేసేవాడు కానీ ఇప్పుడు రిటైరయ్యాక బోలెడు ఖాళీ వుండటం మూలాన పేపర్ ఈ చివరి నుంచి... ఆ చివరి దాకా ఆమూలాగ్రం చదువుతున్నాడు.


మృత్యు తాండవం చేస్తోన్న కరోనా... రోజురోజుకీ పెరుగుతున్న కేసులు... అరవై దాటిన వారికి ప్రమాద భయం... ఇలాంటి వార్తలతో పాటు... ఆరేళ్ళ పాపని కిడ్నాప్ చేసి హత్య చేసిన కిరాతకుడు'...' ఆస్తి తగాదాల్లో తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు... లాంటి వార్తలు కూడా చదివి తెలియకుండానే విపరీతమైన ఆందోళనకు గురవుతున్నాడు. అందువల్ల కొంతకాలం పాటు ఏకంగా పేపర్ చదవడం మానేయమన్నాను. టివి లో న్యూస్ కూడా చూడొద్దన్నాను.


అలా ఐదారురోజులు పాటించేసరికి ఆటోమేటిక్ గా వాడి ఆందోళన తగ్గి బి.పి. కంట్రోల్ లో కొచ్చింది.." అసలు విషయం చెప్పాడు సోమసుందరం.

# మూగజీవుల లబోదిబోలు

వనజశ్రీ



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ

# వస్తువులు - శిల్పాలు



డాక్టర్ ఎమ్.సుగుణరావు
9704677930




సీతాపతిరావు 'పేరు' పడ్డ రచయిత.

అతని కథలు, కవితల ద్వారా అతనికి పాఠక లోకంలో మంచి పేరుంది. దాంతో రిటైరయిన వెంటనే పరాత్పరరావు అనే ఒక సాహిత్యాభిలాషి, ప్రముఖ వ్యాపారవేత్త అతడిని పిలిచి తను పెట్ట బోతున్న ఒక సాహిత్య వీక్లీకి సంపాదకుడిని చేసాడు.

అలా 'సాహిత్య ముగ్ధ' సచిత్ర వారపత్రికకు సీతాపతిరావు ఎడిటర్ అయ్యాడు.

ఆ రోజే పదవీ బాధ్యతలు స్వీకరించాడు.

వెంటనే అతనికి ఫోన్ వచ్చింది. అది పరాత్పర రావు నించి.

"సార్! మన పత్రికకు ప్రకటనలు ఇప్పించగలిగే ఒక ప్రభుత్వ అధికారి సతీమణి తమ రచనలతో మీ దగ్గరకు వస్తున్నారు... వారికి అవకాశం ఇవ్వండి." అన్నాడు క్లుప్తంగా.

"అలాగే సార్! ప్రకటనలే మన పత్రికకు పౌష్టికా హారం...ఆవిడను ప్రోత్సహిద్దాం!" అని తన పనిలో పడ్డాడు.

ఒక పావుగంట తర్వాత ఒకావిడ సంచితో లోపలకు వచ్చింది.

సీతాపతిరావు టేబుల్ మీద దాన్ని వుంచి–

"నా పేరు సరళ... ఇవిగోండి కథలు!" అంటూ ఒక కట్ట అందించింది.

ఒక కథ తీసి చదివేసరికి... సీతాపతిరావు ముఖంలో పంచరంగులు కనిపించాయి.

"ఈ కథలో ఇతివృత్తం ఏమిటి?" అన్నాడు.


"వృత్తాలు గణితంలో కదా వచ్చేది!... కథలో ఎందుకు?" అంటూ ఆమె ఎదురుప్రశ్న వేసింది.

"ఇతివృత్తం అంటే ప్లాట్." అంటూ నసిగాడు సీతాపతిరావు.

"ఔనండీ!... ప్లాట్ వుంది ఈ కథలో. ముసలా యనకున్న రెండొందల గజాల ప్లాటును విలన్ కబ్జా చేస్తాడు." అంది వివరంగా.

సీతాపతిరావుకు ఓపిక నశించలేదు. ఓర్పుగా ఆమెకు కథల గురించిన శిక్షణ ఇవ్వాలని– "కథా వస్తువు, కథాశిల్పం ఇవి ఏవి? మీ కథలో..." అన్నాడు కోపాన్ని అణచుకుంటూ.

"కథావస్తువులా?... ఉన్నాయి! ఈ కథలో హీరో




ముసలాయన కదా! కళ్ళజోడు, కాళ్ళజోడు, పొడుండబ్బా, తెల్లజుబ్బా... ఇవన్నీ కథా వస్తువులే కదా!" అంది వివరంగా.

అప్పటికే సీతాపతిరావు రక్తపీడన పతాక స్థాయికి చేరుకుంది.

"మరి కథాశిల్పం?!" అన్నాడు ఈసారి కోపంగానే.

"ముసలాయన గుళ్ళోకి వెళ్లినట్లు రాసాను. అక్కడి గోడల మీద శిల్పాలు గురించి వర్ణించాను. లౌడ్‌స్పీకర్ లోంచి... 'శిలలపై శిల్పాలు చెక్కినారు. మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు' అనే పాట వినిపిస్తుంది." అంది మరింత వివరంగా.

సీతాపతిరావు ఆ మాటలకు కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళాడు. ఒక నిముషం తర్వాత కళ్ళు తెరిచాడు. అప్పటికి అతని రక్త పీడన పరిమితిస్థాయికి చేరింది.

పరాత్పరరావుగారి మాటలు గుర్తుకొచ్చి


"సరే... మీ కథ... 'వస్తువులు–శిల్పాలు' రాబోయే సంచికలో వేస్తాము. మీరు వెళ్ళవచ్చు." అన్నాడు శాంతంగా.

✦✦✦

రెండు వారాల తర్వాత సరళ ఒక స్వీట్ పాకెట్టుతో అతని దగ్గరకు వచ్చింది.

సార్! నేనో సినిమాకు కథ రాసాను... పేరు 'హిట్ కొట్టాడు' అంది.

'ట్యాగ్‌లైన్ 'బొద్దింక చచ్చింది' లేక ప్రేక్షకుడు చచ్చాడు' అని మనసులో అనుకున్నాడు.




ఇంతలో అతనికి ఫోన్– ఎవరో పాఠకుడి నుంచి–"సార్! మీరు ఈ వారం వేసిన వస్తువులు– శిల్పాలు కామెడీ కథ మీ పత్రికలోనే కాక, ఇంకో నాలుగు వీక్లీలలో వచ్చింది. దీనికి మీ సంజాయిషీ ఏమిటి?" అన్నాడు.

ఆ మాటలకు షాక్ తిన్న సీతాపతిరావు, ఆ ఫోన్ పెట్టేసి– "ఏమమ్మా!... మీ కథ ఇంకో నాలుగు వీక్లీలలో వచ్చిందా... అలా ఒకే కథ అన్ని పత్రికలకు ఒకేసారి పంపకూడదు..." అన్నాడు కోపంగా.

"అదేం అన్యాయం సార్! ఒక దినపత్రికలో ఒక వార్త వస్తే, దానిని నాలుగైదు దిన పత్రికలలో వేస్తున్నారు... మరి, ఒకే కథ నాలుగైదు వారపత్రికలలో వస్తే తప్పేమిటి?! దినపత్రికలకో న్యాయం, వీక్లీలకో న్యాయమా? ఈ అన్యాయం నశించాలి. అందుకోసం ఉద్యమిస్తూ ఈ నా తొలిపోరాటం." అంది ఆవేశంగా.

ఆ మాటలకు వెంటనే ధ్యానంలోకి వెళ్ళిపోయాడు సీతాపతిరావు.

ఈసారి అది ఒక నిముషంకు సరిపోలేదు. అది గంటల తరబడి కొనసాగింది.

"చూసారా... సరళగారి కథల ప్రభావం." అంటూ ఆమె అక్కడినించి నిష్క్రమించింది.

ఇంతలో సరళగారి కథల వలన పాఠకులు వలవల, విలవిల కానీ ప్రకటనలతో గల్లాపెట్టె గళగళ అనే అశరీరవాణి పలుకులతో దిగ్గున లేచాడు సీతాపతిరావు... సాహితీ ముగ్ధ సంపాదకుడు సీతాపతిరావు.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# అరచేతిలో స్వర్గం



చొక్కాపు లక్ష్మునాయుడు
9573250528




సముద్రమంత పట్నంలో చెక్కపడవ లాంటి చిరుద్యోగంతో జీవితాన్ని నెట్టుకొస్తున్న గోపాలానికి లాక్‌డౌన్ ప్రమాద హెచ్చరికను జారీ చేసింది.

కరోనా భయంతో కర్రీపాయింట్లకు వెళ్ళలేక, అద్దెఇంట్లో వంట చేతగాక, కడుపుమంట మొదలయ్యింది.

దీంతో గోపాలానికి పెళ్లివైపు మనసు మళ్లింది.

పెళ్ళాం కాబోయే పిల్ల కోసం గల్లీ గల్లీ జల్లెడ పట్టే ప్రయత్నం చేసాడు గానీ రోడ్డు మీదకు వచ్చిన వాళ్ళకి పోలీసు మాత్రం లాఠీ పెళ్లి చేస్తుండడం వలన పథకం బెడిసికొట్టింది. ఇక లాభం లేదని, నట్టింట్లో మఠం వేసుకుని బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల పేర్లన్నీ పుటం పట్టి మరీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది శాంతమ్మత్త కూతురు సత్యవతి. ఉభయులకు కావాల్సినవాడు కావడం చేత, పీకమీద కత్తిపెట్టి పద్మనాభాన్ని పెళ్లిపెద్దగా ఒప్పించాడు.

పద్మనాభం ఫోన్లోనే సంబంధాన్ని ఒక కొలిక్కి తెచ్చేసాడు. కట్నకానుకల విషయంలో ఓ మాటనుకుంటే చాలు, కొత్త కాపురం మొదలెట్టేయవచ్చు. గోపాలం ఊహల్లో తేలిపోతున్న సమయంలో శాంతమ్మత్త నుండి ఫోనొచ్చింది.

“నాయనా గోపాలం!... నువ్వు గాబట్టి పెళ్ళికి ఒప్పుకున్నాం గానీ, కళ్యాణమండపమనీ, లైటింగనీ, డెకరేషన్ అనీ, డి.జేలనీ లక్షలకు లక్షలు కుమ్మరించాలి. ఇక భోజనాల ఖర్చు వేరే చెప్పక్కర లేదు. అంచేత కట్నం నామమాత్రంగానే ఇచ్చుకోగలను. ఈ రోజుతో పోయేదా నాయనా... రేప్పొద్దున్న అవసరమైనప్పుడల్లా సొమ్ము సర్దుబాటు చేయనూ! పండగలకు, పబ్బాలకు ఉత్తి చేతుల్తో పంపిస్తానా చెప్పు. ఇక ఎల్ఐసి పాలసీలు వగైరా నీ పేరునే ఓపెన్ చేయిస్తాను. ఎలాగైనా నువ్వే మీవాళ్లకి నచ్చజెప్పాలి బాబూ!...” అంటూ సుతిమెత్తగా ఒప్పించింది.

పెళ్లి తర్వాత కూడా ఆర్థికంగా అల్లుడిని ఆదుకోవాలనుకునే అత్తగారి ఆదర్శం నచ్చింది గోపాలానికి. ఈ పాయింట్ ప్రాతిపదికగా ఇంట్లోవాళ్ళని సులభంగా ఒప్పించగలిగాడు.

ముహూర్తాలు ఖరారు చేసుకున్న తరువాత అత్తగారి నుండి గోపాలానికి మరో ఫోన్ కాల్ వచ్చింది.

"నాయనా గోపాలం పెళ్లి ఎంతో వైభవంగా చేద్దామనుకున్నాం. ఈ లాక్‌డౌన్ నిబంధనల వల్ల కల్యాణ మండపాలు తెరుచు కోవడం లేదు. పెళ్లిళ్ళకి పాతికమందికి మించి అనుమతి లేదు. ప్రస్తుతానికి ఇంటి పందిరి కింద పెళ్లి జరిపించేసి, పరిస్థితులు సద్దుమణిగాక రిసెప్షన్ గ్రాండ్‌గా పెట్టుకుందాం. మీ స్నేహితులకు గొప్పగా ఆతిథ్యం ఇవ్వవచ్చును... ఏమంటావు బాబూ!" అంది.

గోపాలానికి అనడానికి ఏమీ లేక– "సరే అలాగే చేద్దామ"ని గొణిగాడు.


ఓ రెండు రోజుల ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అత్తగారి నుండి మళ్లీ ఫోన్ వచ్చింది.

"నాయనా గోపాలం! మేము నీకు గోల్డ్‌చైన్, ఉంగరం పెట్టడానికి, మీవాళ్లు పిల్లకి నల్ల పూసలు, పుస్తెలతాడు, ఉంగరం పెట్టడానికి ఒప్పందం కుదిరింది. కాదనను గానీ ఆడపిల్లకు మూడు వస్తువులు పెట్టడం అరిష్టమని శాస్త్రమట నాయనా... చిన్నదో పెద్దదో నాల్గో వస్తువు బెత్తాయించండి బాబూ!" అభ్యర్థించింది.

అత్తగారి శాస్త్రానికి కట్టుబడి కట్నం డబ్బంతా బంగారం కొట్టులో కరగదీసి బయట పడ్డాడు గోపాలం.

పెళ్లి కార్యక్రమం ముగిసాక... ఓ నాలుగు రోజులు అత్తవారింట గడిపి, అట్నుంచి అటే పెళ్ళాంతో పట్నం బయలుదేరాలని గోపాలం ఆలోచన. అనుకున్నట్టే అత్తగారు ఎల్ఐసి ఏజెంట్‌ని పిలిచి గోపాలం పేర ఒక పాలసీ ఓపెన్ చేయించింది. సెంటిమెంట్ ప్రకారం తొలి పాలసీ తాను కట్టలేకపోతున్నందుకు బాధపడింది.




"ఈ రోజుతో పోయేదా నాయనా రేప్పొద్దున్న అవసరానికి ఆదుకోనూ" మళ్లీ మాటిచ్చింది.

"నాయనా! అసలే మీరుండేది మాయదారి నగరం. బంగారం చూస్తే జనాల కళ్ళు కుడతాయి. ఏ గోల్డ్‌లోనో పెట్టి జాగ్రత్త చేస్తాను లెండి. పెళ్లికైన అప్పులూ తీర్చినట్టుటుంది. ఈ రోజుతో పోయేదా... రేప్పొద్దున్న నా బంగారం మాత్రం నా కూతురిది కాదూ!" శాంతంగా చెప్పుకొచ్చింది.

గోపాలానికి అరచేతిలో స్వర్గం కనపడింది.

బయట ఆటోవాడితో శాంతమ్మత్త బేరమాడుతోంది.

"ఆటోనాయనా! ఈ రోజుతో పోయేదా... రేప్పొద్దున్న తిరుగు, మరుగులకు నీ ఆటోనే రావాలి కదా! సారెకి, సామాన్లకి నువ్వే వద్దువు గానీ, నీకివ్వాల్సిన పాతబాకీకి మరిన్ని డబ్బులు కలిపి ఇచ్చేస్తాను. సరేనా!" ఈ రోజుతో పోయేదేంటి నాయనా!"

అత్తగారి డైలాగు అగ్గిపిడుగులా వినబడుతుంటే గోపాలానికి తన భవిష్యత్ కళ్లముందు కదలాడింది. ఆశలు ఆవిరౌతుంటే ఆటోలో కూలబడ్డాడు.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# నాకు పేరు పెట్టరూ




పోతుబరి వెంకటరమణ
8790639446




**"బా**గుందోయ్ అల్లుడూ!... 'నాకు పేరు పెట్టరూ!' అని ఫ్లెక్సీ బోర్డ్ పెట్టి ఆహ్వానించడం" బయట కట్టిన బోర్డ్ చదువుకుంటూ లోనికొచ్చిన మామ పార్వతీశం అల్లుడు సుధాకర్‌ని మెచ్చుకున్నాడు.

లోపల హాలు అంతా చక్కగా పూలదండలు వేలాడుతూ ఆహ్లాదకరంగా ఉంది.

పట్టుచీరలో బాలింతరాలు వాణిశ్రీ మొహంలో వింత అందం గోచరిస్తోంది.

అలవాటు లేని పంచెకట్టు, పైమీద కండువాతో అవస్థ పడుతున్నాడు సుధాకర్.

"ఏమండోయ్! అంతా సిద్ధమే కదా! బాబూ! రండి మీరిద్దరూ పీటలమీద కూచోండి. అవతల వర్జ్యం 'నేనున్నానంటూ' వచ్చేస్తోంది." పురోహితుడు వస్తూనే హడావుడి మొదలైంది.

సుధాకర్ వాణిశ్రీలు పీటలమీద కూర్చున్నారు.

"ఒక్కమాట అందరూ వినండి. ఇది ఫాల్గుణ మాసం, ఈ రోజు ద్వాదశి, అంటే పన్నెండవ నెల, పన్నెండవ రోజు కదా! ఇప్పుడు పన్నెండు గంటల, పన్నెండు నిముషాల, పన్నెండు సెకండ్లకు పన్నెండు రాశులూ కూడబలుక్కుని ఒకచోట చేరేవేళ...పేరు పెడితే మహజ్జాతకులౌతారు. అందుకని ముందే నా సెల్‌లో టైమ్ ఫిక్స్ చేసి అలారం పెట్టాను."

'ఇదేదో బాగానే వుంది' అనుకొని అందరూ తలూపారు.


"మీరే పేరు పెట్టుకునా రైలుకి గార్డు పెట్టెలాగా చివరన 'శ్రీ' ఉండాలి" అంది వాణిశ్రీ.

తలూపాడు సుధాకర్.

పురోహితుడు మంత్రాలలో పడితే, మిగిలిన వారు మాటలలో పడ్డారు.

'పెళ్ళయి పదేళ్ళకు లేక లేక పుట్టింది అపురూపంగా." అంది అమ్మమ్మ.

"మరే ఎన్ని దేవుళ్ళకు మొక్కామూ! తొలేడు తిరుపతి వెళ్ళి తలనీలాలు ఇచ్చాము... రెండో యేడు అన్నవరంలో వ్రతం చేసాము. మూడో ఏడు సింహాచలం అప్పన్నకి కోడెదూడని అర్పించాము. నాలుగో యేట అరసవిల్లి వెళ్ళి సూర్య నారాయణమూర్తికి వెండికన్ను, బంగారుకన్ను




సమర్పించాము. అయిదో యేట కాణిపాకం వినాయకునికి బెల్లందిమ్మ అందించాము. ఆరో యేట శ్రీశైలం భ్రమరాంబా మల్లికార్జునుల కళ్యాణం చేయించాము. ఏడో యేట బెజవాడ కనకదుర్గ మొక్కు చెల్లించాము. ఎనిమిదో యేట కాశీ అన్నపూర్ణమ్మను వేడుకున్నాము. తొమ్మిదోయేట పళని సుబ్రహ్మణ్యస్వామికి పాలకావిడ మోసాము. పదోయేట షిరిడీ సాయికి పట్టుధోవతి ఇచ్చాము...బాబూ సుధా! గుర్తుపెట్టుకో... పేరు పెట్టేటప్పుడు ఎవరిపేరు మర్చిపోయినా శపించేస్తారు సుమా!" గట్టిగా చెప్పింది నాంచారమ్మ.

"అమ్మా! టైమ్ పన్నెండు అవుతోంది. ఇక్కడ వినాయకపూజ, పుణ్యాహవచనం అయిపోయాయి. పేరు ఏమన్నా అనుకున్నారా?" పురోహితుని హెచ్చరికతో 'రైలు వచ్చిన ప్లాట్ ఫారమ్' లా ఒక్కసారిగా హడావిడి, గందరగోళం ప్రారంభమయ్యాయి.

వెండి పళ్ళెంలోని బియ్యాన్ని పరిచి పసుపుకొమ్ము పట్టుకొని 'కొత్త కథ రాయడానికి కూచున్న కథకునిలా' సిద్ధంగా ఉన్నాడు సుధాకర్.

"సుధా! మీ తాతని మర్చిపోకురా!" తండ్రి అభ్యర్థన.

వాచీలో పెద్దముల్లు పెద్దపెద్ద అంగలతో పరుగెడుతోంది.

"అన్నయ్యా! రాత్రి కామాక్షి మామ్మ కలలోకి వచ్చిందిరా! దేవుళ్ళు, దేవతలు అందరితోనూ పోరి మరీ నీ కడుపులో పడ్డాదిట."

"నా కడుపులోనా...?" అమాయకంగా అన్నాడు సుధాకర్.

"అదేలేరా! వదిన కడుపులోనే. పేరు కలపడం మరిచిపోవద్దని మరీమరీ పో(కో)రింది." అంది స్వర్ణ.

"పన్నెండు పది. ఇంకా రెండు నిముషాలే ఉంది." పురోహితుడు బొయ్్మన్నాడు.

"గ్రామదేవత సామాలమ్మ పైనుండి సుర సురా చూస్తుంది చూడరోయ్." మేనమామ అరిచాడు.

"ఇంటి ఇలవేల్పు గంగమ్మ గంపడంత ఆశ పెట్టుకుందిరా." మేనత్త గుర్తు చేసింది.


"తీర్థయాత్రల దేవుళ్ళందరూ క్యూలో నిల్చున్నార్రోయ్!" తల్లి అరిచింది.

"పన్నెండు పన్నెండు" అరిచారెవరో.

అందరూ సుధాకర్ చుట్టూ మూగేసి ఒకేసారి మాట్లాడడం మొదలుపెట్టారు.

"పెంట. ఆపండి" అని సుధాకర్ గట్టిగా అరవడం, సెల్ అలారం మోగడం, 'పెంట శ్రీ' అని పురోహితుని నోటినుండి వెలువడడం ఒకేసారి జరిగిపోయాయి.

అంతే! డిటర్జెంట్ ప్రకటనలా అందరూ ఒక్కసారిగా అవాక్కైపోయారు.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# అనుకున్నదొక్కటి



కట్టా రాంబాబు
9440140510




**మా**యదారి సంత... మాయదారి సంతాని... చచ్చిపోతున్నాను వినలేక. మాయదారి తుమ్ము లతో ఇవెక్కడి గోలండి. ఎవరైనా మీ వారేంటండి అలా తుమ్ముతున్నారు' అని అడుగుతుంటుంటే ఏం చెప్పాలో తెలియక సిగ్గుతో చచ్చిపోతున్నాను" శ్రీమతి తిట్లదండకం అందుకుంది.

నేనేమన్నా కావాలని తుమ్ముతున్నానా? అవి వచ్చాయంటే ఏకధాటిగా పది, పదిహేను తుమ్ము లొచ్చేస్తాయి. పదిమందిలోనే తిరగాలంటే నాకే చచ్చేంత సిగ్గుగా వుంటుంది. వీటివల్ల అప్పుడ ప్పుడు అవమానాలు పాలవ్వవలసి వస్తుంది. ఎప్పుడైనా మా పనిమనిషి పని చేసుకుని ఇంటికెళ్ళే టప్పుడు తుమ్మితే– "ఏంటి సార్! ఇంకా నాలుగి ళ్ళలో పనిచెయ్యాలి. బయలుదేరేటప్పుడు తుమ్ము తారేంటి?" అనేది.

మా నాన్నయితే మరీను– "మన వంశంలో ఎవరికీ తుమ్ముల జబ్బులేదు. ఈ వెధవకే వచ్చింది. బయటకెళ్ళాలంటే భయం, ఇంటికి రావాలంటే భయం" అనేవారు.

"అదేంటండి అలా అంటారు వాడేమైనా కావా లని తుమ్ముతున్నాడా ఏంటి. మందులు వాడు తున్నాడుగా తగ్గుతాయిలెండి" అనేది మా అమ్మ ఒక్కర్తే నాకు సపోర్టు. ఇంక మా బామ్మ మాటలు వింటుంటే దాన్ని పీకనులిమి చంపేయ్యాలన్నంత కోపం వస్తుంది. దానికి ఎనభైఏళ్ళు పైనే.

"ఏరా తింగరి వెధవా! నన్ను నీ తుమ్ములతో చంపెయ్యాలని చూస్తున్నావా? మీ పిల్లల పెళ్ళిళ్ళు చూసాకే చస్తాను." మా అమ్మాయికి, అబ్బాయికి పెళ్లిళ్ళు చేయాలంటే ఇంకా పదిహేను ఏళ్ళు పడు తుంది. అంత వరకు బతకాలనే దాని ఆశ.

మా వీధిలో వాళ్ళు ఎక్కడికైనా బయలుదేరు తున్నప్పుడు నేను ఎదురొస్తే వెనక్కి వెళ్ళిపోయే వారు నేను ఎక్కడ తుమ్ముతానోనని.

ఓసారి నా దగ్గర చదువుకున్న అమ్మాయి తండ్రి మా ఇంటికొచ్చి వాళ్ళ అమ్మాయి పెళ్లిని శుభలేఖ ఇచ్చాడు.

"తప్పకుండా వచ్చి మీ అమ్మాయిని, అల్లుణ్ణి ఆశీర్వదిస్తాను" అని చెప్పాను.

ఆయన తల వంచుకుని– "మీరు రావొద్దని

చెప్పడానికి బాధపడుతున్నాను సార్! మీరు సుముహూర్తం టైములో ఎక్కడ తుమ్ముతారో నని భయం సార్! మీరు ఇంట్లోనుంచే ఆశీర్వ దించండి సార్!" ఆ రోజు నేను పడ్డ బాధ వర్ణనాతీతం.

మరోరోజు అర్జెంటుగా హైదరాబాదు వెళ్ళ వలసి వచ్చింది. ట్రైన్‌లో బెర్తులు దొరకడం కష్టం కాబట్టి లగ్జరీబస్‌లో టికెట్ బుక్ చేసు కున్నాను. రాత్రి తొమ్మిది గంటలకు బస్టాండ్‌కు చేరుకున్నాను.


అప్పటికే బస్ రెడీగా వుంది. మరో విశేష మేమిటంటే ఆ బస్సు కొత్త బస్సు. అదే మొదటి ప్రయాణం దానికి. చాలా బాగుంది. అందులో మొదటి సీటు నాదే డ్రైవరు వెనకాల సీటు. సరిగ్గా డ్రైవరు బస్సు స్టార్ట్ చేస్తున్న సమయంలో వరుసగా మూడు తుమ్ములొచ్చేసాయి.

అంతే స్టార్ట్ చేసిన బస్సుని ఆపేసి "ఎవడ్రా తుమ్మింది శుభమా అంటూ బస్సుని స్టార్ట్ చేస్తుంటే" అంటూ గట్టిగా అరిచాడు డ్రైవరు.

అప్పుడు బస్సులో వున్నవాళ్ళంతా నన్నెలా చూసారో మాటల్లో చెప్పలేను.

డ్రైవరు బస్సు దిగి వాష్‌రూమ్‌కెళ్లి కాళ్ళు చేతులు ముఖం కడుక్కుని టీ తాగొచ్చి అక్క డున్న బల్లమీద కూర్చున్నాడు.

పావుగంట తర్వాత బస్ స్టార్ట్ చేయబో యాడు. ఎందుకో డౌటొచ్చి నన్నోసారి బస్ దిగమని స్టార్ట్ చేసాక ఎక్కమన్నాడు చేసేదేం లేక అలాగే చేసాను.




ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘట నలు. ఎన్నెన్నో అవమానాలు. తుమ్ములకు మందులు వాడుతున్నా తగ్గినట్టే తగ్గి మళ్ళీ మామూలుగా అయిపోయేది పరిస్థితి.

ఓ రోజు బజారులో గోపాలం తగిలాడు. వాడు నా ఫ్రెండు. ముందసలు వాణ్ణి గుర్తు పట్టలేకపోయాను. ఎందుకంటే వాడు గుండు చేయించుకున్నాడు.

"ఏరా! తిరుపతి వెళ్లావా?" అనడిగాను.

"తిరుపతి కాదు అన్నవరమూ కాదు నేనే చేసుకున్నాను." అన్నాడు.


"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఏం చెప్పమంటావురా! రెండు నెలలనుంచీ ఒకటే తుమ్ములు. తుమ్మలేక చచ్చిపోతున్నా నుకో. మందులు వాడినా తగ్గడంలేదు. ఎవరో చెప్పారు తలకు డై చేసుకున్నప్పుడు అది పడకపోతే తుమ్ములొస్తాయని. దాంతో ఏం చెయ్యాలో తెలియలేదు. డై చేసుకోపోతే తలంతా ముగ్గుబుట్టలా తయారవుతుంది. నీలాంటి ఫ్రెండొకడు ఒక సలహా ఇచ్చాడు. ఎప్పుడూ గుండు మెయింటెయిన్ చెయ్యమని. అలా చేస్తే తుమ్ములబాధ తగ్గడమే కాదు తల నెరిసిపోతుందనే బాధ కూడా తగ్గుతుందని అందుకే అప్పటినుంచి గుండు మెయింటెయిన్ చేస్తున్నాను. ఇప్పుడు హాయిగా వుందనుకో." అన్నాడు గోపాలం.

అప్పుడర్థమైంది నాకు తుమ్ములు అదే పనిగా ఎందుకొస్తున్నాయో... నాకూ తల నెర వడం మొదలైంది. అందుకే డై చేసుకోవడం మొదలెట్టాను. అప్పట్నుంచీ తుమ్ములు మొదల య్యాయి. అంటే నాకు తుమ్ములు తగ్గాలంటే డై మానెయ్యాలన్నమాట. మరి డై మానేస్తే ముసలాడిలా కన్పిస్తానేమో. ఏం చేయాలి?... అయినా నాకిప్పుడు వయసేం తక్కువ కాదు. యాభై దాటాయి. తలకు రంగేసి వయసు తక్కువగా కన్పించాలనుకోవడం అవసరమా అనిపించింది.

రంగేసుకుని తుమ్ముతూ అవమానాలు పడే కంటే అసలు వేసుకోవడం మానేస్తేనే మంచిది కదా అన్పించింది... అయితే డై చేసుకోవడం హానికరం అని కూడా ఎక్కడో చదివాను...


గోపాల్‌లాగా గుండు చేయించుకోవడం ఎందుకు మామూలుగానే వుందామనుకు న్నాను. కొంతకాలం ఇబ్బందిగా అనిపించినా అలవాటయి పోతుందిలే అని కూడా అను కున్నాను.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ఓ చుప్పనాతి కథ



గంగాధర్ వడ్లమన్నాటి
9908445969



**“అ**దేవిటి లలితా!... ఆమెను పనిలో పెట్టుకున్నావ్! అంట్లు సరిగ్గా తోమదటా... ఇల్లు తడి గుడ్డ పెడితే జిడ్డు పోదటా...ఎక్కడికైనా వెళ్లి రమ్మంటే ముఖం మాడ్చుకుంటుందటా...” చెప్పింది సరోజ.

“అయితే ఏవిటి! నాకు కావాల్సిన కాలక్షేపం మాత్రం పుష్కలంగా ఇస్తోంది. అసలే బోర్ కొట్టి చస్తున్నాను. ఆ టీవీ సీరియల్స్ ఇదివరకు ఆసక్తిగా చూసేదాన్ని. ఇప్పుడు అవి కూడా రొటీన్ అయి పోయాయి. అలాంటి సమయంలోనే, ఎలా ఎలా అని ఆలోచిస్తుండగా ఈ మంగ పనిలోకి కుదిరింది. పనికి దొంగ అయినా, అందరిళ్ళలో జరిగేవి మాత్రం పూసగుచ్చినట్టు చెబుతుంది నాకు. వినడానికి భలే ఆసక్తిగా ఉంటాయా విషయాలు. అందుకే దాన్ని ఇంకా ఉత్సాహ పరచాలని, ఈ నెల నుండి అయిదువందలు జీతం కూడా పెంచాను.” చెప్పిందామె గొప్పగా.

“అలా పరాయి విషయాలు తెలుసుకోవడం అంత సంస్కారం కాదేమో లలితా!”


“అలా అనకు. రొటీన్‌కి భిన్నంగా ఆలోచించు. ఇందులో కూడా ఓ కిక్కుంది. ఆమె నాకు ఎంత ఆశక్తికర పరాయి విషయాలు చెప్తుందనీ...” పరవశంగా చెప్పింది లలిత.

“అంతగా మైమరిచిపోవడానికి, ఆమె ఏం చెప్తోందో నీకు?” అడిగింది సరోజ వ్యంగ్యంగా.

“అలా అడుగు చెప్తాను! మన వీధి చివరి సుబ్బారావుగారి అమ్మాయిది రెండవ పెళ్ళట. మొదటి వాడి మీద అక్రమ కేసు పెట్టి పది లక్షలు గుంజారట. మళ్ళీ ఏం తెలియనట్టు, తప్పంతా ఆ అబ్బాయిదే అని ప్రచారం చేశారట. వేరే కాపురం పెట్టినందుకు మొగుడ్ని వదిలేసిందట ఆ అమ్మాయి.”

“అలా ఎందుకూ? వేరు కాపురం ఈమెకే మంచిది కదా?” అడిగింది సరోజ.

“అక్కడే ఉంది కిటుకు! అత్తమామలు లేకపోతే, సాధించడానికి ఎవరూ లేక బోరు కొట్టిందట... కొన్ని పనులు ఈమే చేసుకోవాల్సి వచ్చిందట. వాళ్ళ అమ్మకి చాడీలు ఎవరిమీదా చెప్పలేక పోయే







దట. అందుకే మళ్ళీ వాళ్ళతో కలిసుందాం రండి అందట. దానికి వారు వద్దు బాబోయ్ వద్దు అంటే, విడాకులు ఇచ్చేసిందట. అలాగే, మన పక్క పోర్షన్ పార్వతి వాళ్ళబ్బాయి, వాళ్ళ సొంత కొడుకు కాదట. దత్తత తీసుకున్నారట. ఆ విషయం ఆ అబ్బాయికి ఈ మధ్యే తెలిసి, నా సొంత తల్లిదండ్రులు ఎవరో చెప్పమని అడ్డంగా నిలదీసాడట. సరే అని, బరంపురంలో బడ్డీకొట్టు అప్పారావ్ అని చెప్పి వెళ్ళమన్నారట. అప్పటినుండి మళ్ళీ సొంత తల్లిదండ్రుల ఊసెత్తలేదట దరిద్రుడు... ఇక నళిని, ఆ సురభి అపార్ట్‌మెంట్స్‌లో వోల్డేజ్ హోం పేరుతో బోలెడు డబ్బు దండుకుంటోందట.

ఇక మన కాలనీ ప్రెసిడెంటు మానసగారికి మందు అలవాటు ఉందట. ఫ్రిజ్‌లో నీళ్ళనుకుని, ఈ పనిమనిషి వోడ్కా తాగేసిందట. అలా బయటపడ్డ ఆ విషయం ఎవరికీ చెప్పొద్దందట ఆ మానస. ఆవిడ, వాళ్ళాయనా మందుని నీళ్ళ బాటిళ్ళలో పోసుకుని పీతల్లా తాగుతారట. అలాగే, కొత్తగా మనకాలనీకి వచ్చిన అచ్చిబాబుకి, ఆ చీటీల చిలకమ్మ ఎన్ని సైగలు చేసినా అతను పట్టించుకోలేదట. ఏదో బుద్ధిమంతుడు అనుకుందట. కానీ కేటరేట్ ముదిరి కళ్ళు కనబడవని తర్వాత తెల్సుకుందట... ఇప్పుడు ఇద్దరి మధ్యా వక్రసంబంధం నడుస్తోందట" చెప్పి బుగ్గ నొక్కుకుంది లలిత.

అవన్నీ విన్న సరోజకి ఒళ్ళు మండిపోయింది.

"ఏంటి లలితా నువ్వు! పరాయి విషయాలు వినడమే తప్పు. అలాంటిది అవి నీకు చెప్తున్నందుకు ఆమెని ఇంకా ఎంకరేజ్ చేస్తావా! ఈ స్వభావంగల వాళ్ళ వల్ల జీవితాలు ఎలా తలక్రిందులవుతాయో తెలుసా? అలాంటి వారితో ఎప్పటికైనా ప్రమాదమే తెలుసుకో!" అసహనం చూపింది సరోజ.


"తప్పేముంది?... ఆశక్తిగా ఉంటే వింటున్నాను... ఇదో సరదా! దట్సాల్!!" చెప్పింది లలిత మహా తేలిగ్గా.

"నీకు మాటలతో చెప్పి చూద్దాం అని అనుకున్నాను... కానీ నీవు వినేట్లు లేవు!!...అసలు విషయం చెప్పాల్సిందే. నీ ఇంటి గుట్టు కూడా మీ పనిమనిషి అందరికీ చెబుతోంది...
నమ్మకం లేదా!... కొన్ని చెబుతాను విను... నువ్వు మీ ఆయన్ని కొడతావనీ, మొగుడితో కాళ్ళు పట్టించుకుంటావనీ, ఇంట్లో వండకుండా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తావనీ, అత్తగారిని ఓల్డ్ ఏజ్ హోంలో జాయిన్ చేయించావనీ, ఆన్‌లైన్‌లో పేకాట ఆడతావనీ...ఇలా చాలా చాలా చెబుతోంది. ఇది చూడు..." అంటూ ఓ వారపత్రికని తెరిచి ఆమెకి అందించింది.

ఆ పత్రిక చూసిన లలిత– "ఓ చుప్పనాతి కథకి మొదటి బహుమతి" అని ఆ కథని చక, చకా చదివి– "ఏవిటిది! అచ్చం నా కథలానే ఉంది!" అంది లలిత అయోమయంగా.

"నీ కథలా కాదు. ఆ కథ నీదే. ఆ చుప్పనాతి నువ్వే. మన పక్క వీధిలో ఉంటున్న రచయిత్రి అరసుకుమారి వ్రాసింది. ఆమె ఇంట్లో కూడా మీ ఇంట్లో పని చేసే పని మనిషే పని చేస్తోంది మరి" చెప్పింది సరోజ.

గుడ్లు తేలేసింది లలిత.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ఇస్తినమ్మ వాయినం...



ఉప్పల పద్మ
8340933244



**పా**ర్కులో దీనంగా కూర్చొని ఉన్నాడు పిచ్చేశ్వర రావు. అప్పుడే అక్కడికి వచ్చిన సలహాలరావు పిచ్చేశ్వరరావుని చూసాడు.


“అదేమిటండీ!... పిచ్చేశ్వరరావుగారు మీ ముఖంలో కాంతి లేదు. ఏదో పోగొట్టుకున్న మాదిరిగా అలా ఉన్నారు ఏమిటీ? మీ బాధేమిటో చెప్పండి! నేను ఏమైనా సాయం చేయగలనేమో చూస్తాను.” అని సలహాలరావు అనడమే తరువాయి... అంత సేపు పార్కులో పచ్చ గడ్డి పీకుతూ నేలచూపులు చూసిన పిచ్చేశ్వరరావు–

“ఏం చెప్ప మంటారండి నా బాధ... మొన్నటికి మొన్న ఎంత బాగా రాసానండి... ఆ సాగదీత సాహితీ సంఘం వాట్సాప్ గ్రూపులో అచ్చం సినారె కవిత్వానికి మల్లే రాశాను. ఒక్కరంటే ఒక్కరన్న మెచ్చుకున్నారా? నిన్న మా ఆవిడ ఈ నాలుగు గిన్నెలు తోమండి మరి లేకపోతే టిఫిన్ కూడా పెట్టను అన్నా కూడా టిఫిన్ లేకున్నా సరే అని కదలకుండా కూర్చుని మరీ రాశానండి ఒక కవితను... అచ్చంగా గురజాడ ముత్యాలసరాలకు మల్లే. కనీసం దాని కన్నా ఎవరైనా స్పందిస్తారా అంటే ఒక్కరూ స్పందించలేదు. ఇవాళ గ్రూపులో నుండి బయటకు వద్దాం అనుకున్నాను... కానీ రాసినవన్నీ గ్రూపులో పెట్టడానికి అయినా ఉండాలి కదండి... అందుకే ఉండిపోయాను.” అని పిచ్చేశ్వరరావు తన బాధనంతా సలహాలరావు ముందు కక్కేసాడు.

ఆ ముచ్చటంతా వినగానే సలహాలరావుకు కడుపులో దేవినట్టయింది.

ఎందుకంటే తన బాధ కూడా ఇదే.

ఆగబట్టుకోలేక “పిచ్చేశ్వరరావుగారు అచ్చం మీకు మల్లే ఉందండి నా పరిస్థితి కూడాను. అందుకే మనమిద్దరం ఒకటవుదాం... ఎవరో మనల్ని పొగిడేదేమిటండీ... మనకు మనమే పొగుడుకుందాం. మీరో నలుగురిని... నేనో నలుగురిని కూడగట్టుకొని మనం కూడా గ్రూపులు క్రియేట్ చేద్దాం... మనం జాయిన్ అయిన ఇతర ఏ గ్రూపులోనైనా మీరు గానీ నేను గానీ మన సభ్యులు కానీ ఏ కవితలు, కథలు ఇతర ఏ ప్రక్రియలు పోస్ట్ చేసినా ‘వాహ్వా... వాహ్వా’ అంటూ










పొగిడేసుకుందాం... అంతే కాదు మనం కూడా కొత్త కొత్త ప్రక్రియలు సృష్టిద్దాం. మీ సంఘం వాళ్ళు మా సంఘానికి, మా సంఘం వాళ్ళు మీ సంఘానికి...ఏడాదికోమారు చక్కగా ఒకరి కొకరం పురస్కారాలు కూడా ఇచ్చేసు కుందాం. ఏమంటారు ఒప్పుకుంటారా?"

"బాగా ఉందండి మీ సలహా సలహాలరావు గారు... భేషుగ్గా ఆచరిద్దాం!! కాకపోతే ఆ ప్రక్రియలు ఏమిటండి అర్థం కాలేదు."

"ఆc! ఏముందండీ... పిచ్చేశ్వరరావు గారు నాలుగు అక్షరాలతో నాలుగు పదాలు వేసి నాలుగు వాక్యాలు రాస్తే వెన్నెల సరాలు. ఐదు అక్షరాలతో ఐదు పదాలు వేసి ఐదు వాక్యాలు రాస్తే పంచకాలు అని పేర్లు పెట్టి కొత్త ప్రక్రి యలు విడుదల చేద్దాం... మన ప్రక్రియలో వంద కవితలు రాసిన వాడికి శతవెన్నెల కిరీటి, పంచకరత్న... వంటి బిరుదులు ఇచ్చేద్దాం. ఏమంటారు?"

"ఏమంటాను సలహాలరావు గారు! మీ సల హాలకు జేజేలు అంటాను."

వెంటనే సలహాలరావు–

"ఇంకెందుకు ఆలస్యం పదండి మీరో నలు గురిని నేనో నలుగురిని వెతుక్కుందాం! చెరొక సంఘం పెట్టుకుందాం." అని ఇద్దరూ కూడ బలుక్కుని మొత్తానికి చెరో నలుగురిని వెతు క్కొని చెరో సంఘం పెట్టేశారు.


ఇస్తినమ్మ వాయినం పుచ్చుకుంటినమ్మ వాయినంలా వీరిరువురి సంఘాలు మూడు ప్రక్రియలు ఆరు పురస్కారాలుగా కొనసాగ డమే కాక ఇతర సంఘాలలో కూడా వీరి ప్రాబల్యం పెరిగింది.

ఇక సలహాలరావు ఊరుకుంటాడా మరో సలహాను మోసుకొచ్చి పిచ్చేశ్వరరావు చెవిలో ఊదాడు.

"పిచ్చేశ్వరరావు గారు ఏదో పురస్కారాలు, కొత్త ప్రక్రియల పుణ్యమా అంటూ... మన సంఘాలు బాగానే వర్ధిల్లుతున్నాయి. ఇటు వంటి సమయంలోనే మనం మేలుకోవాలి. నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి. అందుకే ఇప్పటి నుండి మనము కేవలం మన సంఘాల వాళ్లనే కాకుండా ఇతర ప్రాంతాల సంఘాల వారికి కూడా పురస్కారాలు ప్రకటిద్దాం. కవితా కేసరి, పద్య గండ భేరుండ, నవ్య ప్రక్రియా పురుషోత్తమ... వంటి పురస్కారాలు ఎలాగూ ప్రకటిస్తున్నాం... కాబట్టి పురస్కారానికో ఫీజు పెట్టేద్దాం. శాలువ మెమెంటో వాళ్ళు తెచ్చు కున్నా సరే... మనల్ని తెమ్మన్నాసరే... వీవీఐ పీలతో సన్మానం చేయిస్తామని చెబుదాం... భోజనం ఉచితమని ప్రకటిద్దాం. ఏమంటారు పిచ్చేశ్వరరావు గారు?!"

"ఏమంటాను?... మీ సలహాలకు జేజేలం టాను. ఇంకేం పదండి... ప్రకటన సిద్ధం చేసి అన్ని గ్రూపుల్లో వేసేద్దాం..."

అంటూ ఇద్దరూ భుజాలు ఎగరేసుకుంటూ ముందుకు కదిలారు.






ప్రఖ్యాత రచయిత

# మల్లాది వెంకటకృష్ణమూర్తి ఫన్ ప్రశ్నలకు-

# సుదర్శనమ్

## పంచ్ సమాధానాలు

Cartoons: Sangam

✦ నేను 'హాస్యాస్పదం' అనే హాస్య దినపత్రికని తీసుకురాబోతున్నాను. దాన్ని మీరు ఎడిట్ చేస్తారా?

**భలేవారే! ఇప్పుడు రోజూవారీ 'దిన'పత్రికల్లో (న్యూస్‌పేపర్లలో) దిగుమతి అవుతున్న బోలెడు 'రాజకీయ హాస్యాస్పద' కేమిడీని మించి...హాస్యాన్ని 'మీరు' తీసుకొస్తానంటే ఎవరొద్దంటారు మహాశయా!... (అయినా, హాస్యాన్ని 'యాడ్' చేస్తే ఒప్పుకుంటారు గానీ... 'ఎడిట్' చేస్తానంటే... నన్ను 'డిలీట్' చేసేగల్రు...పాఠకులు...నన్నోగ్గీయండీ)**





✦ మీరు రేలంగి, రమణారెడ్డిలతో నటిస్తే చూడాలనుంది మాస్టారు.

**మీరు పింగళిగారితో కలిసి 'మాటలు' రాస్తానంటే... తప్పకుండా గురూగారూ!**



✦ మీరు శుంఠ కాదు కాబట్టి మీరు మీ నాన్నగారికి పండితుడు అయ్యే అవకాశం ఇవ్వలేదంటే మీరేమంటారు?

**మీ ప్రశ్నలో మొదటి భాగాన్ని... మాయావిడే ఒప్పుకోదు...! పోనీ... మీయంతటివారే చెప్పారని చెప్పి ఒపిద్దామన్నా... ఆవిడకు చెవుడు... నేను మూగ(ఇంట్లో)...! ఇక మా నాన్నగారు తను పండితుణ్ణని నేను పుట్టేటప్పటికే ప్రూవ్ చేసేసుకుని... ఆ అవకాశం ఇవ్వకుండా చేసే అవకాశం నాకివ్వలేదు!**

✦ కొన్ని కార్టూన్లలోలా యమదూత మీ దగ్గరికి వచ్చి 'పదబాబూ' అంటే మీ జవాబు?

**ఎవడిని పడితే వాడిని... 'బాబూ' అనకూడదు భట్టూ... (బడా)బాబులు హర్టు అవుతారు..! "వాడెవడు నీతో రావటానికి... వస్తే నేనే రావాలిరోయ్" అంటారు. ఈ బాబుకి కోపమొస్తే నీ బాబు (అదే...నీ బాసు) నీ జాబు పీకేస్తాడు! అపుడు నువ్, హెల్లుకి 'అల్టర్నేటివ్‌గా' ఇక్కడే యే హాస్పటల్‌లోనో 'పని' చేసుకోవాల్సి వస్తుంది!!!!**





✦ పెళ్ళాం ఊరెళితే?

**'నోటికి' తాళం తీసేసి... 'ఇంటికి' వేస్తా!!**



✦ మీ.......తే?

**'నా.......తే' నా!**
**అయితే ఓ.కే!**
**ఇంకేముందీ, మనం ఫ్రీ.....కే!**
**(మీ చుక్కల్లో క్లూస్ పసిగట్టా)**
**ఆశీర్వదించండి గురూజీ!**




✦ మీరు ఇంకో పేరు పెట్టుకోవాల్సి వస్తే ఏ పేరుని ఎన్నుకుంటారు?

**పేరులో'నేము'ందీ, పేరు తెచ్చుకోవాలి గానీ... అని అనుకోరాదు! పేరులోనే 'ఫేము'ంది అని తెలిస్తే ఇహ పేరు తెచ్చుకోనవసరం లేదు! అందుకే... ఏ పద్మభూషణ్' అనో పెట్టుకుంటా!**



✦ అసలైన, సిసలైన హాస్యాన్ని సీరియస్‌గా నిర్వచించండి చూద్దాం.

**'అసలైన' హాస్యాన్ని, 'సిసలైన' కేమెడీని ఆల్రెడీ చాలామంది చించుతున్నారు... మీరు చూడట్లేదా?! ఇక చించడానికి ఏం మిగిలిందనీ... చీప్‌గా! ఇంతకన్నా 'సీరియస్'గా చించలేను... చీప్‌గా!!**



✦ నా అనుమానం మీరు సి.ఐ.డి.అని. ఇలా అందర్నీ మోసం చేస్తూ ఏం పరిశోధన చేస్తున్నారు?

**అయ్యా! 'మోసం గుట్టుగానూ... కరోనా రట్టుగానూ'ఉండాలని పెద్దలు చెప్పారు! మీ అనుమానాల్ని ఇలా పబ్లిక్ చేసి నా పరిశోధన గుట్టు రట్టు చేయకండి ప్లీజ్!**

✦ చిరంజీవి (పోనీ పవన్‌కళ్యాణ్) ఇంట్లో మీకిచ్చిన టీలో ఈగుంటే మీ రియాక్షన్.


**నో రియాక్షన్....ఓన్లీ యాక్షన్! గట గట తాగేస్తా... ఆ 'ఫ్లై', ఫ్లయి అయిపోకుండా. అసలే అది 'మెగా' ఈగాయే! ఆ తర్వాత నిద్దట్లోంచి ఉలిక్కి పడి లేస్తా! (పోనీ... ఉలిక్కిపడి నిద్దట్లోంచి లేస్తా)**



✦ నిర్మలెవరు? నిజం చెప్పండి.

హన్నా!

**ఇదేదో మీ స్వ'గతం'లా ఉందే!... పోనీ మీరడిగారే అనుకుందాం... అడిగింది 'హన్నా'ని... నన్ను కాదు! నేనెలా చెప్పగలను సామి?!**





✦ ఓ కన్ను మాత్రమే మూసుకుని నిద్రపోయేది?

**ఒఠి... అనుమానపు పక్షి! (అయ్యుంటుంది)**





✦ ఈ ప్రశ్న నేను వేసుండకపోతే?

**అయినా నేను జవాబు ఇచ్చి ఉండేవాడిని...! 'ప్రశ్న లేని జవాబు'గా ప్రైజ్ ప(కొ)ట్టేసి ఉండే వాడిని!**

✦ జనవరి1 2021 పేజీలో మీ డైరీలోని మొదటి వాక్యం?

**'ఇది నూతన సంవత్సరపు తొలి రోజు'...! (ఈ వాక్యాన్ని డైరీలో రాసుకునేందుకు అనుమతి(రోజూలాగే)నిచ్చిన మా శ్రీమతికి రుణపడి ఉంటా!!)**



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# షరతులు వర్తిస్తాయి



బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524



**“కో**టి రూపాయల ఆస్తికి వారసుడు, లక్ష రూపాయల ఆదాయం ఉన్న యువకునికి – కోటి రూపాయల ఆస్తి కలిగి, లక్ష రూపాయలు సంపాది స్తున్న అందమైన వధువు కావలెను. కట్న, కాను కల ప్రసక్తి లేదు”. ప్రకటన చూసి ఆనందంతో భార్య తాయారుకు చెప్పాడు వెంకటేశం.

మంచి తరుణం మించి పోతుందని భార్య తొందరపెట్టటంతో, కరోనా లాక్‌డౌన్‌లోనే ఆన్ లైన్ పెళ్ళి చూపులు ఏర్పాటు చేశాడు.

తెర మీద అబ్బాయిని తేరిపార చూసి –

“ఏం ఉద్యోగం బాబూ?” అంది తాయారు.

పెళ్ళికొడుకు గణపతి కాళ్ళు దర్జాగా ఊపుతూ–

“లక్ష రూపాయల జీతం వచ్చే ఏ ఉద్యోగం ఇప్పించినా చేస్తాను ఆంటీ!” అన్నాడు.

తాయారు గతుక్కుమని భర్తను గిల్లి “ఇదేంటి?” అంది చిన్నగా.

వెంకటేశం గట్టిగా అరవబోయి... గొంతు సవ రించుకొని “అంటే ఉద్యోగం లేదన్నమాట. మరి కోటి రూపాయల ఆస్తీ అదీ... భూములు, ఇళ్ళు వగైరా...?” అన్నాడు ఇందులో ఏం తిరకాసుందో అనుకుంటూ.

గణపతి జననీ, జనకులు తెరమీదకొచ్చి–


“ఆస్తిదేవుంది బావగారూ! మీకుంటే ఒకటీ మా కుంటే ఒకటీనా? మీ తదనంతరం ఆస్తి కూతురు, అల్లుడికేగా! అబ్బాయి కోటి రూపాయల ఆస్తికి వారసుడన్న మాటేగా దానర్థం!” అన్నారు లాజి క్కులు లాగుతూ.

తాయారు ఆశ్చర్యంగా చూస్తూ– “మరి ప్రకట నలో....” అంటుండగానే...

జనకుడు ఫెళ్ళున నవ్వి– “అబ్బాయి కోటి రూపాయల ఆస్తికి వారసుడు అన్నాం కానీ ఆస్తి ఉంది అనలేదుగా. ఇక‘లక్ష ఆదాయం’ అంటారా– మొగుడు, పెళ్ళాల్లో ఎవరు ఉద్యోగం చేసినా ఆ జీతం ఇద్దరిదీ కదా! ప్రకటనలో ‘షరతులు వర్తి స్తాయి’ అని కూడా రాశాం... మీరు చూసినట్లు లేదు” అన్నాడు.

అప్పుడు చూశాడు వెంకటేశం.

చివర్లో చిన్న చుక్క పెట్టి దాని పక్కన ‘షరతులు వర్తిస్తాయి’ అని కరోనా వైరస్లా కంటికి కనబడ







కుండా రాసి ఉంది... ఇందులో ఉన్న మతలబును పెళ్ళి కూతురు పంకజం సరిగ్గా పట్టుకుని...

"ఈ పెళ్ళి నాకిష్టమే" అంది నవ్వుతూ.

లాక్‌డౌన్ ఎత్తేయగానే... యాభై మంది అతిథుల సాక్షిగా పంకజానికి, గణపతికి పెళ్ళై పోయింది.

మూణ్ణిద్దర్లు అయ్యాక... ఉద్యోగంలో చేరటానికి వెళ్ళిన గణపతి, వెంటనే వెనక్కి వచ్చి–

"ఎంత బీటెక్ తప్పితే మాత్రం మరీ బట్టల కొట్లో సేల్స్‌మాన్ ఉద్యోగమా? అదీ జీతం ఎనిమిదిన్నర వేలా?" అని చిందులేశాడు.

వెంకటేశం అల్లుడి భుజం తట్టి– "అంటే సాలుకి లక్షా రెండు వేలు. అది నువ్వడిగిందాని కన్నా రెండు వేలు ఎక్కువే నాయనా!" అన్నాడు నవ్వుతూ.

తను మోసపోయానని గ్రహించిన గణపతి–

"మరి కోటి రూపాయలు ఆస్తి?" అన్నాడు ఏడుపు మొహంతో.

తాయారు కల్పించుకొని– "అమ్మాయి కూడా సేల్స్‌గర్ల్ ఉద్యోగం చేస్తుంది... మీకు పిల్లలు పుట్టి పెద్దయ్యే నాటికి... మీ ఇద్దరి జీతాలు వడ్డీతో కలిపితే కోటి రూపాయలు అవుతాయి. దానికి మీరేగా వారసులు!" అంది.


అల్లుడు దిమ్మ తిరిగి తూలి పడబోయి–


"అన్యాయం! ఇవన్నీ నాకు ముందు చెప్పలేదు!" అని ఆక్రోశించాడు.


పంకజం భర్త బుగ్గల్లో గట్టిగా పొడిచి–

"ఛీ! ఫోండి!... మీరు మరీనూ... షరతులు వర్తిస్తాయని మీరే కదమ్మా అన్నారు!" అంది గోముగా.

## చిత్రహాసం



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# దెయ్యాల పండుగ



దేశరాజు
9948680009





**దే**వుళ్ళనీ, దేవతలనీ పూజించేవారుంటారు. కానీ... ఎక్కడైనా దెయ్యాలను పూజించే వారుంటారా?... ఇప్పుడీ దేవుళ్ళు, దెయ్యాల గొడవ ఎందుకంటే... అందుకు కారణం వాళ్లావిడ.

నిన్నటివరకు లక్షణంగా ఉండేది. ముత్యాల ముగ్గు సినిమాలో సంగీతంత కాదుగానీ, ఏదో 'కాకి పెళ్లాం కాకికి ముద్దు' అన్నట్టు వాళ్ళావిడ కూడా పాటలు పాడకపోయినా, పనిపాటలు బాగానే చేసుకునేది. ఏమైందో ఏమో పొద్దున్నించీ విపరీతాలు మొదలయ్యాయి. ఇంటిని దెయ్యాల కొంపలా మార్చేసింది. క్షమించాలి, 'దెయ్యాల' కాదులెండి. 'దెయ్యం' కొంపలా మార్చేసిందనే అనాలి. ఎందుకంటే, నేనింకా దెయ్యాన్ని కాలేదుగా! అదేంటో రాత్రికి రాత్రి ఇల్లంతా బూజులు పట్టేసాయి. ఎప్పుడో మూల పడేసిన పాత సామానులు, అవీ హాల్లోకి వచ్చి పడ్డాయి. వీటికి తోడు గోడలమీద అక్కడక్కడ ఎర్రటి చేతిగుర్తులు. వీటన్నిటినీ చూస్తూ తారెత్తిపోయాడతను.

అసలే కొత్త పెళ్లాం... ఇంకా రెణ్ణెల్లు కూడా కాలేదు పెళ్ళై. ఏమైందా అని జుట్టు పీక్కో బోతుంటే, జుట్టు విరబోసుకుని-శశిరేఖ వేషంలో వున్న ఘటోత్కచుడిలా-చేతులు రెండూ ఎడంగా పెట్టుకుని, పెద్ద పెద్ద అంగలు వేస్తూ హాల్లోకి వచ్చింది భార్యామణి. స్టిక్కర్ తీసేసి, కుంకుమ బొట్టు పెట్టుకుంది. దాన్ని కూడా కనుబొమల నుంచి నుదుటి చివరి వరకూ వీరతిలకంలా దిద్దుకుంది. డబ్బాడు పౌడరూ ముఖానికి పూసుకుందనుకుంటా, అది కాస్త కాస్త రాలుతోంది. పెళ్లి పీటలమీద ఒక బుగ్గపై పెట్టిన చుక్కను గుర్తు చేస్తూ ఇప్పుడు రెండు బుగ్గలపైనా కాటుక బొట్టు పెట్టుకుంది. భర్తను ఏమాత్రం గమనించనట్టే వంట గదిలోకి వెళ్లిపోయింది.

పెళ్లాం అవతారం చూసి గడగడా వణికిపోతూనే నెమ్మదిగా వంటింటి గుమ్మం వరకు వెళ్ళి లోపలకు తొంగి చూసాడు.

టీ కలపడానికి పంచదార, టీ పొడి కూడా గుప్పిళ్ళతో తీసి వేస్తోంది. మంత్రగాళ్ళు పూజల్లో జల్లినట్టు, టీ పెట్టిన గిన్నె మీదకు వంగుని పెద్ద శబ్దం వచ్చేలా వాసనను ఆఘ్రాణిస్తోంది.




తానింకా అక్కడే ఉంటే 'నరవాసన, నర వాసన' అంటుందేమోనని భయం వేసింది అతడికి.

వెంటనే పార్కింగ్‌లోని కారు దగ్గరకు పరిగెట్టాడు. సిటీలోని ఉండే అత్తవారిల్లు గుర్తుకు వచ్చింది. వెళ్లి 'పిచ్చిదాన్ని కట్టబెడతారా!' అని కడిగేద్దామని బయల్దేరాడు.

అంతా విన్న అత్తగారు– 'ఏదో పాడుగాలి సోకుంటుంది నాయనా!... నువ్వే జాగ్రత్తగా చూసుకోవాలి' అంటూ ఓ వేపమండల కట్ట, ఇంకో డబ్బాడు పసుపు చేతిలో పెట్టింది.

బావురుమంటే బాగోదని ఏడుపు ముఖంతో తిరుగుముఖం పట్టాడు.

తెలిసిన సైక్రియాట్రిస్ట్ ఒకరు దారిలోనే ఉన్నట్టు గుర్తొచ్చి, వెళ్లి తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

"ఆడవాళ్ళ మీద ఇటీవల జరుగుతున్న ఘోరమైన దాడులు, హింస ఇలా మతి చలించడానికి కారణం కావచ్చు. ఆమెను కాస్త టీవీ వార్తలకు దూరంగా వుంచు. మందులిస్తా తీసుకెళ్ళు." అంటూ మొహమాటం లేకుండా భారీగా బిల్లు కూడా ఇచ్చాడు. చేసేది లేక జేబులు ఖాళీ చేసుకుని, ఇంటికి వెళ్ళే ధైర్యం లేక అట్నించటే ఆఫీసుకు వెళ్లిపోయాడు... అయినా, చీకటి పడే వేళకు మళ్ళీ ఇంటి ముఖం పట్టుకోక తప్పలేదు.

అల్లుడు చెప్పినవన్నీ విన్న అత్తగారు– 'దీనికి ఇంకా అల్లరి పోయినట్టు లేదు' అనుకుంటూ తీరిక చిక్కాక, చీకటి పడ్డాక కూతురుకు ఫోన్ చేసింది.

కూతురు పకపకా నవ్వి– "ఏం కాలేదమ్మా, నేను ఆయనంత చదువుకోలేదని, విదేశాలు తిరగలేదని ఎకసెక్కాలు ఆడుతున్నారు. పాశ్చాత్య పోకడలు, ఫ్యాషన్లు తెలీవని ఎగతాళి చేస్తున్నారు. అందుకని చిన్న గుణపాఠం చెబుదామని..." అంటుండగానే కాలింగ్‌బెల్ మోగింది.


ఫోన్ కట్ చేసి తలుపు తీసింది.


'ఈ రాత్రి ఎలా గడుస్తుందోరా, భగవంతుడా' అనుకుంటూ బిక్కచచ్చిపోయి నిలబడిన భర్తని చూడగానే ఆమెలో మళ్ళీ చిలిపితనం మొగ్గ తొడిగింది.

పెద్దగా ఓ వికటాట్టహాసం చేసింది.

అంతే! అతడి పై ప్రాణాలు పైనే పోయాయి. బ్యార్‌మంటూ గబుక్కున వెనక్కి ఒక్క ఉరుకు ఉరికాడు.

కానీ, ఆమె అంతకంటే, వేగంగా ముందుకు ఉరికి చొక్కా పట్టుకుని అతడిని లోపలకు లాక్కుంది. భయంతో తెరుచుకున్న అతని నోటిని మూసేస్తూ, నెమ్మదిగా 'ఈ రోజు హాలోవీన్ డే' కదా అంటూ చెవికొరికింది.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# కుందన



శింగరాజు శ్రీనివాసరావు
9052048706




**కా**మాక్షి హడావుడిగా గుడిలోకి వచ్చింది. – ముఖంచూస్తే బాగా ఏడ్చినట్లుగా కూడ అని పిస్తున్నది.

“పూజారి గారు! పూజారి గారు!!” పిలిచింది రొప్పుతూ.

“ఏమిటమ్మా! అంతలా ఇదయిపోతున్నారు... ముందు స్థిమితపడండి. తీర్థం తీసుకోండి... ఆయాసం తగ్గుతుంది!...” తీర్థమివ్వబోయాడు పూజారి.

“తీర్థం తరువాత స్వామి. ఈ వీరభద్రస్వామి నమ్మికగల దేవుడంటారు. కోరిన కోరికలల్లా తీరు స్తాడంటారు. నిజమేనా స్వామీ”

“సందేహమే లేదమ్మా! ఈ స్వామి మహాశక్తి మంతుడు. మన మనసులో కోరికలను చెప్పుకుని, నేనిచ్చే నల్లగుడ్డలో ఒక రూపాయి కాసు వేసి ... ముడుపుకట్టి, గుడి చుట్టూ పదకొండు ప్రదక్షిణలు చేసి... అదిగో ఆ కనిపించే రావిచెట్టు కొమ్మకు కట్టి నమస్కారం చేసుకుంటే చాలు, నలభై రోజుల లోపు మీ ఆపదలు తొలగి మీరు కోరుకున్న కోరిక నెరవేరవలసిందే. అంతటి మహత్యం కలవాడు తల్లీ ఈ వీరభద్రస్వామి. ఇంతకూ మీకొచ్చిన ఆపద ఏమిటమ్మా?”

“ఏం చెప్పమంటారు పూజారి గారు! మా కుందనకు అన్నీ కష్టాలే. పుట్టు మూగది. తండ్రి మొదట్లో బాగా చూసేవాడు కాదు. అయినా దానికి తండ్రంటే వల్లమాలిన ప్రేమ. ఇప్పుడిప్పుడే ఆ పిల్ల మనసు తెలుసుకుని బాగా చూసుకుంటు న్నాడనుకుంటే, పాపం కుందనకు ప్రాణాంతక మైన జబ్బు చేసింది... ఆ విషయం తెలియక ప్రేమించేవాడు పెళ్ళికి తొందరపెడుతుంటే కాదని, తండ్రి తెచ్చిన సంబంధానికి తలవంచింది. పిల్ల అనారోగ్యం ఇంట్లో కూడ ఎవరికీ తెలియదు. వెంట పడుతున్న ప్రేమికుడిని కాదనలేక, వేరే వాడిని చేసుకోలేక, ముంచుకొస్తున్న చావును ఆప లేక నరకయాతన అనుభవిస్తున్నదండీ... మా కుందన. దాని కష్టాలు తొలగిపోవాలని, ఆ దేవుడే ఆ పిల్ల ఆరోగ్యాన్ని బాగుచేసి, ప్రేమించినవాడికే ఇచ్చి పెళ్ళిచేయాలని ముడుపుకట్టాలి స్వామి. కొంచెం నల్లగుడ్డ ఇవ్వండి....” చెప్తున్నంతసేపు

కామాక్షి కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

పాపం ఎంత కావలసిన అమ్మాయో ఆ కుందన. కొంపదీసి ఆ అబ్బాయికి తల్లి కాదు కదా ఈమె. ముందు ముడుపుకట్టనీ తరువాత అడుగుదాం అనుకుంటూ, నల్లగుడ్డ ఇచ్చాడు పూజారి.

ఎంతో భక్తితో ప్రదక్షిణలు చేసి, ముడుపుకట్టి వచ్చింది కామాక్షి.

పూజారి స్వామికి పూజచేసి తీర్థమిచ్చాడు.

"ఇంతకూ ఎవరుతల్లీ ఆ కుందన. నీకేమవుతుంది... ఆమె గురించి ఇంత బాధపడుతున్నావు? ఆమె మీకు దగ్గర బంధువా?" అడిగాడు పూజారి ఉండబట్టలేక.

"బంధువుకంటే చాలా ఎక్కువ. మీ ఇంట్లో వాళ్ళకు కూడ తెలిసే ఉంటుంది. చాలా యోగ్యురాలు"

"అవునా! ఇంతకూ ఎవరు తల్లీ ఆమె?"

"కూనిరాగం సీరియల్‌లో హీరోయిన్- కుందన. ఆమె కష్టాలు గట్టెక్కాలని రోజూ స్వామికి అష్టోత్తరం చేయండి. మనసుపెట్టి చేయండి స్వామి" అంటూ అయిదు వందల రూపాయల కాగితం పళ్ళెంలో పెట్టి కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది కామాక్షి.

పూజారిగారికి ఫ్యూజులు ఎగిరిపోయి బల్ల మీద చతికిలబడ్డాడు ఆమె సమాధానం విని. కళ్ళముందు అయిదు వందల కాగితం రెప రెపలాడింది. ఎవరెటు పోతేనేం మన ముడుపు మనకు దక్కిందని సంతోషపడ్డాడు.


కానీ లోపల దేవుడు మీమాంసలో పడ్డాడు.

నిన్న హైదరాబాదులో... తన గుడిలోనే ముడుపుకట్టి ఆ సీరియల్ దర్శకుడు కోరిన కోరిక గుర్తుకు వచ్చింది.

"స్వామీ! కూనిరాగంలో కుందనకు మరో వెయ్యి ఎపిసోడ్‌ల వరకు పెళ్ళి జరుగకుండా ఉండేలా...చిత్రవిచిత్రమైన మలుపులు తిప్పేలా నా మేధస్సును తీర్చిదిద్దు తండ్రీ!" అని రెండు వేల రూపాయల కాగితం ముడుపులో కట్టాడు.

గుర్తొచ్చిన దేవుడు ఏం చెయ్యాలో అర్థంగాక గుటకలు మింగసాగాడు.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# నల్లకోడి



డి. మధుసూధనరెడ్డి
8985378587



**మా**నవుడు సహజముగా ఆశాజీవి. ఆశలు పెరిగి కోరికలై, ఆ కోరికలు తీర్చుకొనుటకు మానవ ప్రయత్నములెన్నియో చేసి అలసిపోయి చివరకు పరమాత్ముని అనుగ్రహమునకై పూజలు చేయును. కోరికలు మరీ పెద్దవి అయిన యెడల తపస్సు చేయును.

అయితే...పరమాత్ముడు ప్రత్యక్షమై వరమిచ్చిన పుడు ఆ వరమును ఉచితముగా స్వీకరించి పరమాత్మునికి కృతజ్ఞతాపూర్వక వందనము చేయవలెనే గానీ అతిగా ఏమీ కోరరాదు.

అంతేగాక "నా కోరిక తమకు పూర్తిగా అర్థమవ్వలేదు స్వామీ" అంటూ ఏదో వివరించే ప్రయత్నమూ చేయరాదు. మరీ ముఖ్యముగా పరమాత్ముని మానసికస్థితిని గమనింపక, కోరిక గురించి భీష్మించి పట్టు పట్టరాదు.

ఈ విషయమును సవివరముగా తెలుపుటకు సూతమహాముని శౌనకాది మునులకు 'నల్లకోడిగా మారదలచుకున్న తెల్లకోడి వృత్తాంతము'ను చెప్ప దొడంగెను.

పూర్వము జంబూ ద్వీపమునందలి భరత ఖండమున 'తింగరుడు' అను నామధేయమున ఒక తెల్లకోడి నివసించుచుండెను.

ఆ కోడికి మిగతా తెల్లకోళ్ళతో కలిసి నివసించుచుండిన సంతోషము కంటే... తాను నల్లకోడిగా జన్మించనందుకు కలిగే బాధయే అధికముగా యుండినది. దీనికి కారణమేమన, లోకమునందలి జనులు వివిధ గ్రామదేవతల పూజలు మొదలుకొని, క్షుద్రదేవతల పూజల వరకు నల్లకోళ్ళనే ఎంపిక చేసుకొనుట వలన, తన జన్మ, విలువ లేనిదయ్యెనని నిరుత్సాహము కలిగి, ఎటులనైనా తాను నల్లకోడిగా మారవలెనన్న కోరికను పెంచుకొనెను.

ఆ కోరికను తీర్చుకొనుటకు అది కోడి ప్రయత్నములెన్నియో చేసెను. మానవ ప్రయత్నములకే ఏ దిక్కూ లేని ఈ భరతఖండంబున ఆ కోడి ప్రయత్నములన్నియూ వృథా కాసాగెను.

అప్పుడు... పరమాత్ముని అనుగ్రహమునకై పూజలు, వ్రతములు మొదలిడి, పెక్కుదినముల వరకూ ఫలితము లభింపక, ఒక మహర్షి సలహా

మేరకు తపస్సు చేయనారంభించెను.

మొదట రెండు కాళ్ళపై నిలుచుని, తదుపరి ఒంటికాలిపై నిలుచుని, అటు పిమ్మట శీర్షాసనమునయుండి తపస్సు చేయసాగెను.

అంతట పరమాత్ముడు సంతసించి ప్రత్యక్షమై వరము కోరుకొన మనగా– తనను నల్లకోడిగా మార్చమని వేడుకొనెను.

అందులకు పరమాత్ముడు ఈ జన్మలో తెల్లకోడిగా పుట్టితివి గాన వచ్చే జన్మమందు నీవు నల్లకోడివై జన్మించెదవని వరమిచ్చెను.

సార్ధకనామధేయుడైన ఆ కోడి నన్ను ఈ జన్మలోనే నల్లకోడిగా మార్చ వలెనని... వచ్చే జన్మవరకు ఆగలేనని... భీష్మించుకుని కూర్చుండెను.

అసలే పరమాత్ముడు తమ అత్తగారింటి పంచాయితీలతో చిరాకుగా నుండినవాడై–

"సరే...నీవు అందులకు వచ్చే జన్మవరకు ఆగనవసరం లేదు..." అని పలికి అంతరార్థమయ్యెను.


అప్పటినుండి... ఆ తెల్లకోడి నల్లకోడిగా మారు తరుణం కొరకు ఎదురు చూచుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడిచెను.

అంతట.....ఒకానొక ఆదివారమున అదే ప్రాంతమున ఇంటర్ చదువుతున్న ఒక బాలిక కళాశాల లేకపోవుట చేత చికెన్‌ఫ్రై చేసు కొనవలెనని తలచి తమ తాతను కోడి మాంసము తెచ్చియ్యవలసిందిగా ఆజ్ఞాపించెను.

అందువల్ల విధి వక్రించి ఈ తెల్లకోడి ఆ బాలిక చేతికి చేరి, తుదకు పొయ్యిపైకి చేరెను.

ఆ బాలిక తల్లి ఉద్యోగస్తురాలవడం చేత, ఆమెకు వంటలు సరిగా రాకపోవడం చేత... ఆ బాలిక ఈ మధ్యనే యూట్యూబ్ సహాయంతో గరిటె తిప్పడం మొదలుపెట్టెను.

మొదటిసారి వండినప్పుడే బావుందని కొందరు మెచ్చుకొనుట వలన... ఆ బాలిక ఒకింత ఉత్సాహముతో... మరియొకింత హెచ్చించిన ఆత్మవిశ్వాసముతో చికెన్‌ఫ్రై చేయసాగెను.




చివరివరకు బాగుగానే నడచిన ఆ వంటకమునందు నిమ్మకాయ పిండదలచి ఆ బాలిక తన తమ్మునితో రెండు నిమ్మకాయలు తెచ్చి కోసి వ్వమని ఆదేశించాను.

ఆ బాలుడు తన తండ్రివలే టి.వి. పిచ్చోడవడంచేత, టి.వి. చూస్తూ రెండు నిమ్మకాయలు కొయ్యుటకు నాలుగు నిముషాలు కాలయాసన చేయగా... ఆ బాలిక కోపోద్రిక్తురాలై స్టవ్‌ను సిమ్‌లో పెట్టుట మరచి, వంటగది నుండి హాలులోకి వెళ్ళి, తమ్ముని చీవాట్లు పెట్టి అతని వద్ద నుండి నిమ్మకాయముక్కలు తెచ్చి పిండుటకు ఆలస్యమవడం చేత, ఆ కోడి గిన్నెలోనే మాడి... పరమాత్ముని మాట ప్రకారం మరొక జన్మ ఎత్తకమునుపే నల్ల కోడిగా మారెను.

కనుక లోకమునందలి జను లెల్లరూ పరమాత్మ వరమిచ్చిన పుడు మూసుకుని తీసుకొనవలెనే గాని తింగరునివలే ప్రవర్తించ రాదని సూత మమహాముని శౌన కాదిమునులకు తెలిపి...

చీకటి పడుటచే నిజగృహము నకేగెను.



శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీల్లో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# కోతానంతం



భాగవతుల భారతి
8121712950



"**బా**బాయ్! బాగున్నావా?" వాకిట్లో అడుగు పెట్టగానే అనంతరామ్ పలకరింపు.

"ఏరోయ్! ఎప్పుడొచ్చారూ అందరూనా?" సింకి చాటంత ముఖంతో అడిగాను.

అనంతాన్ని చూసి నేనంత ఆనందపడిపోవటా నికి కారణముంది. అనంతం మా అన్నయ్య కొడుకే కాక, సరదా సందడి పిల్లవాడు.

వాడు కథలు చెబుతుంటే కళ్ళకు కట్టినట్టు పాత్రలు సజీవంగా మా ముందు నిలిచేవి. పిల్లలం దర్నీ చుట్టూ జేర్చుకుని చెబుతూ చెబుతూ... కథ మధ్యలోకావాలనే ఆపేవాడు కథని.

ఇక సస్పెన్స్ భరించలేక పిల్లలంతా వాడి వెంట పడి 'తర్వాత ఏమయిందో చెప్పవా అన్నయ్యా...' అని అడుగుతుంటే... మంచినీళ్ళిస్తే చెబుతా, నాకు పక్కవేస్తే చెబుతా అంటూ బ్లాక్ మెయిల్ చేస్తుంటే చూడాలీ, మా పిల్లలందరి పాట్లూ, నవ్వులపువ్వుల వాసంతం.

ఇక వాడు కోతలు కోస్తాడూ... కనీవినీ ఎరుగని రీతిలో ఉంటాయవి.

మేమంతా– "ఏరా!... లేతలేత సొరకాయలు తెచ్చావా కోయటానికి?" అని సరదాగ ఆటపట్టి స్తుంటాం వాణ్ణి.

"అబ్బే అదేం లేదు బాబాయ్" అంటూ సిగ్గోటీ వెధవకీ.

మాది కొల్లేరు చాంతాడంత బంధువర్గం. మా రోజుల్లో సెలవులిస్తే చాలు, అందరం పల్లెటూళ్ళకి చెక్కేసి, ఆ రెండు నెలలూ, సందడే సందడి... ఇప్పుడూ అంతే!... ఒకరు ముందు వెనుకగా అందరం చేరిపోయాం. ఎన్నో సరదాలు సెలవుల్లో.

సాయంత్రం– "ఏరా! అనంతం!... ఏంటీ సంగ తులూ!" అంటూ కాస్త కదిపా!

"బాబాయ్! ఏం చెప్పమంటావూ!... ఓ రోజు అమ్మా నాన్నా ఇంట్లో లేరు. నేనే ఉన్నా...ఏదో చప్పుడైంది. ఎక్కడా అని ఆలకించా... వంటింటి వెనుక వడ్లపురిలోంచి అని పసికట్టా... నెమ్మదిగా వెళ్ళి తొంగిచూద్దును గదా!...


బాబాయ్ఁణ నువ్వు నమ్మవ్... ఈలావున ఇంతె త్తున... పందికొక్కులు పదంటే పది మిడిగుడ్లేసు కునీ, ఓ దానితోఒకటి బోకురు బోకరు మని శబ్దం

చేస్తూ... కలియబడి కొట్టుకుంటున్నాయ్.

ఏంచేయాలీ?! కట్టికోసం వసారాలోకి వచ్చా... చూద్దును గదా! కోతుల గుంపు... అరడజను కోతులు లందుకు లందు ఉన్నాయ్. నా సంగతి తెలీక వచ్చుంటాయ్ ఒక్కటే అరుపు అరిచా!

'హాఁయ్!' అని.

అవి రాక్షసుడెవరో వచ్చాడనుకుని పరుగెత్తాయి... చూస్కో మా దొడ్డి తెలుసుగా అరెకరం దాటి అవతల గోడవరకూ తరిమి... తిరిగి వెనక్కి వస్తుంటే పాము దొడ్డికి







అడ్డంగా పోతోంది... నాతో పెట్టుకుంటుందా?"

"పాములు పట్టేవాళ్ళని పిలవకపోయావా?" మా వాళ్ళలోనే ఎవరో అందుకున్నారు.

మావాడికి పౌరుషమొచ్చింది.

"ఏంటీ!... ఏం మాట్లాడుతున్నావ్! ఈ వీర శూర ప్రతాప పరాక్రముడితోనేనా పరాచికాలూ నీకూ... ఆ పాముకీనూ..."

"మరి ఏం చేసావన్నయ్యా?..." పిల్లల ఉత్సుకత.

"దారికి అడ్డంపోయి... తోక దొరకపుచ్చుకున్నా... తలచుట్టూ గిరాగిరా తిప్పా... నా సామిరంగా గింగిరాలే... బండకేసిబాత్తే..."

"మరి... పందికొక్కులేమయ్యాయ్ అన్నయ్యా!?"

"వస్తున్నా అక్కడికే!... చూరులోంచి చిన్న చూరుకుట్టుబద్ద తీసా! బోకురు, బోకురు మంటూ మీద కొస్తున్నాయ్. ఫెడీ ఫెడీ ఫెడీ బాదేసా! చచ్చూరుకున్నాయ్"

"చూరుకుట్టుబద్దకే?" అనుమానంతో కూడిన ఆశ్చర్యం వ్యక్తమైంది మాలో.

"అమ్మానాన్న తిరిగి వస్తే ఇదంతా చూసి భయపడతారనీ, బక్కెట్ల కొద్దీ నీళ్ళుపోసి చీపురుతో రుద్ది, కడగలేక చచ్చా!..."

"అదీ... తర్వాత..." అనంతం ఏదో చెప్పబోయేంతలో...

ఏదో వస్తువు వచ్చి మా అందరి మధ్యలో పడింది. దాంతో పాటే... "బల్లి! బల్లి!!" అని అరిచారెవరో.

అంతే! ఒక్క ఉదుటున లేచి, అరుగు మీంచి దూకి, పరుగులంకించుకున్నాడు అనంతరామ్.

వీధి మలుపులో మునసబు గారి గడ్డివాము చాటుకు పోయే వరకూ ఆపలేదా పరుగు. కదలకుండా పడివున్న వస్తువేమిటా అని తీసిచూసా. అది పట్నంనుండి వస్తూ మావాడు కొనితెచ్చిన, ప్లాస్టిక్ బల్లి.

వార్నీ! అనుకుంటూ పగలబడి నవ్వులే నవ్వులు.... పిల్లా పెద్దా! పిల్లలు మాత్రం అనంతాన్ని వెతుక్కుంటూ, వెళ్ళారు... పకపక నవ్వుల మధ్య!

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# కోవిడ్ ఫోబియా



ఇంద్రగంటి నరసింహమూర్తి
9959352900




**"కా**ఫీవద్దు...కషాయం పట్రా!" గావుకేక పెట్టాడు పద్మనాభం... భార్య స్మిత తెచ్చిన కాఫీ కప్పు వైపు చూస్తూ.

ఆ అరుపుకు అదిరిపడింది స్మిత.

"గంట క్రితం తాగారు...మళ్ళీ కషాయమా! రోజంతా కషాయాలు, కారప్పొడులతో కాలం వెళ్ళ బుచ్చడం నా వల్ల కాదు." విసుక్కుంది స్మిత.

"ఇప్పుడే వాట్సాప్‌లో చూసాను... కషాయం తాగకపోతే కరోనా ఖాయం. నాదసలే వీక్ బాడీ... నాకెందుకో గుండె దడగా అనిపిస్తోంది... పల్స్ వీక్‌గా కొట్టుకుంటున్నాయ్." ఖంగారుగా చెప్పాడు పద్మనాభం.

"చాల్లెండి సంబడం!...ముప్పూటలా బలం కోసం నానా గడ్డీ తింటున్నారు... ఇంకా వీక్ ఏమిటి?...ఈ గది దాటి బయటకు రావడంలేదు. ఇంట్లో వున్నా మూతికి మాస్క్ తీయడంలేదు. రోజుకి పాతికసార్లు కడిగి కడిగి... అరచేతులు అరగ్గొట్టుకుంటున్నారు. అన్ని రకాల కషాయాలూ ఆరారా ఆరగిస్తున్నారు... హోమియోపతి, ఆయు ర్వేదం మందులు మింగుతున్నారు. వేపచిగుళ్ళు తింటున్నారు... పసుపునీళ్ళు తాగుతున్నారు. వాడె వడికో డబ్బిచ్చి... మంత్రజలం బెడ్‌రూమ్‌లో చల్లించు కున్నారు. ధూపాలేస్తున్నారు...ఇంకేం కరోనా!...కరోనాకే ఈ చర్యలు దడ పుట్టిస్తాయి... ఈ చుట్టుపక్కలకి రావడానికి కరోనా సాహసిం చదు." చేతులు తిప్పుతూ చెపుతున్న భార్య వైపు కోపంగా చూసాడు పద్మనాభం.

"ఏమో!....ఎన్ని చేసినా ఈ మహమ్మారి ఏ మూల నుండైనా రావచ్చు... దీన్ని నమ్మలేం అని అందరూ చెపుతున్నారు. వెళ్లి చెయ్యి బాగా రుద్దు కుని కడుక్కుని కషాయం పట్రా." ఆర్డర్ వేసాడు పద్మనాభం.

భార్య బిత్తరపోయి చూడసాగింది.

"వామ్మో... నాకు కరోనా వస్తే... ఈ గదిలో బందీనైపోవాలి... అప్పుడు నా గతేంటి దేవుడా?" బావురుమంటున్న మొగుడివైపు దీనంగా చూసింది భార్య.

పద్మనాభం నుదుటిపై చేత్తో కొట్టుకున్నాడు.

బట్టతలపై వేళ్ళతో మద్దెల వాయించాడు.

సీలింగ్ వైపు చూస్తూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు... గుండెపై చేత్తో రాసుకుంటూ దిక్కులు చూసాడు.

భర్త చేష్టలు చూస్తూ భార్య ఘొల్లుమంది.

చేతిలో సెల్ మ్రోగింది.

"మీ ఇంట్లోంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. మీ ఆయనకి కరోనా వచ్చినట్లుంది. మీ గుమ్మం బయట లాక్ చేసేస్తున్నాం. ఇంక మీరు తలుపు తీయడానికి వీల్లేదు." చెప్పింది పక్క అపార్ట్‌మెంట్ పంకజం.

"అబ్బే!...అదేంలేదు....కరోనా వస్తుందేమోనని భయపడి ఛస్తున్నా!... ఏడుపులు ప్రాక్టీస్ చేసుకుంటున్నా... తలుపు తాళం తీయండి." కసిగా చెప్పింది స్మిత.

✦✦✦

నాలుగు నెలలుగా వర్క్ ఫ్రం హోం అంటూ ఆ గదిలోనే గడుపుతున్నాడు పద్మనాభం.

లాప్‌టాప్‌తో ఆఫీస్ వర్క్ సెల్‌ఫోన్‌లో వాట్సాప్ సందేశాలు, టీవీలో కరోనా వార్తలే ప్రపంచమయింది...

ఇంట్లోకి కావలసిన వస్తువులు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించుకోవడంతో భార్యాభర్తలకు వీధిలోకి వెళ్ళే అవసరం లేకపోయింది.

మూడు నెలలుగా షికార్లు లేక, సినిమాలు చూడక, విందులు వినోదాలు లేక ఇంటిని అంటిపెట్టుకు కూర్చోవడం స్మితకు తలనొప్పిగా పరిణమించింది.

అస్తమానూ టీవీలో కరోనా వార్తలు వింటున్న పద్మనాభానికి కరోనా ఫోబియా పట్టుకుంది.

అనుక్షణం కరోనా తనని పట్టుకున్నట్టు ఫీలవుతున్నాడు. ఐసోలేషన్ వార్డులో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నట్లు కలలు కంటున్నాడు. తనకు కరోనా వస్తే జీవితం శూన్యమనుకుంటూ భార్యను వేధించసాగాడు.

కడిగిందే కడగడంగా రోజు గడుస్తోంది.

రోజు రోజుకూ భయంతో ఛాందసంగా ప్రవర్తిస్తున్న భర్తను చూస్తున్న స్మితకు ఆదుర్దా పెరగసాగింది.

✦✦✦

మరో రెండు రోజుల తర్వాత...

బావమరిది నుండి కాల్–"నాకు పది రోజుల క్రితం కరోనా వచ్చింది బావా!" అంటూ.

"నే వింటున్నది నిజమేనా?..." ఆశ్చర్యపోయాడు పద్మనాభం.

"నిజమే బావా!...పది రోజుల క్రితం కరోనా లక్షణాలు కనిపిస్తే టెస్ట్ చేయించుకున్నా. పాజిటివ్ వచ్చింది. ఇంట్లోనే ఉండి మందులు వాడి జాగ్రత్తలు తీసుకున్నా. ఇమ్యూనిటీ పెంచుకున్నా. ఇప్పుడు లక్షణాలు పూర్తిగా తగ్గిపోయాయి. నిన్న టెస్ట్ చేయిస్తే నెగిటివ్ వచ్చింది... నేనిప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను బావా!" చెప్పాడు గోపాలం.

"జాగ్రత్తస్మీ.....చాలా జాగ్రత్తగా ఉండాలి." తడబడుతూ అన్నాడు పద్మనాభం.

"ఏం భయంలేదు బావా.....కరోనా మనం




అనుకున్నంత భయంకరమైన వ్యాధి కాదు. కొంచెం లక్షణాలు కనపడగానే టెస్ట్ చేయించుకుని మందులు వాడితే ఉఫ్ అని ఊదినట్లు పోతుంది. కాని ధైర్యంగా ఉండాలి. ఉత్సాహంగా ఉండాలి... బయటకు వెళ్లినప్పుడు మాస్క్‌లు ధరించడం... సామాజిక దూరం పాటించడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే చాలు! ఇంట్లో ఉంటున్నారుగా నువ్వూ అక్కా బాగా ఎంజాయ్ చేస్తున్నారనుకుంటున్నాను." హుషారుగా చెప్పాడు గోపాలం.

"అబ్బే!... మేం చాలా భయపడుతున్నాం. భారంగా రోజులు గడుస్తున్నాయి." నీరసంగా చెప్పాడు పద్మనాభం.

"భయమెందుకు బావా?! ధైర్యంగా ఉంటేనే కరోనా ఏం చేయలేదు. సంతోషమే సగం బలమన్నారు. హాయిగా ఎంజాయ్ చేయండి. నన్ను చూడు బావా....కరోనా వచ్చింది. వారంలోనే పోయింది. మన వయసువాళ్ళకి రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది. అప్పుడప్పుడు వచ్చే కామన్ కోల్డ్ లాంటిదే కరోనా కూడా. భయపడకు. విష్ యు హేపీ టైమ్స్." బావకు ధైర్యం చెప్పాడు గోపాలం.

బావమరిది మాటలు టానిక్‌లా పని చేసాయి. పద్మనాభంలో దిగులు మాయమై హుషారొచ్చింది.

గబగబా హాలులోకి వచ్చాడు.

"ఇదిగో కషాయం..." అంటూ భార్య అందిస్తున్న గ్లాసు తీసుకోకుండా మాస్క్ తీసేసి–

"కాఫీ పట్రా..... తాగుతూ టీవీలో సినిమా చూస్తూ ఎంజాయ్ చేద్దాం." అంటూ భార్య బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు.

మూడునెలల తర్వాత భర్త స్పర్శకు భార్య బుగ్గలు కెంపులయ్యాయి.

మరో గంట తరువాత...

పద్మనాభం సినిమా చూస్తున్నప్పుడు, స్మిత కిచెన్‌లోకి వెళ్ళి తమ్ముడికి కాల్ చేసింది.

"థాంక్సా! తమ్ముడూ....ఆయనలో మార్పు తేవడానికి నా సలహా పాటించి నీకు కరోనా వచ్చిందని అబద్ధం చెప్పావు. నీ ధైర్య వచనాలకు ఆయన మారారు... మన ప్రయత్నం ఫలించింది...." నెమ్మదిగా చెప్పింది స్మిత నవ్వుతూ.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# 'నేము' లోనేప్రేముంది?




కలవల గిరిజా రాణి
9959948223






**"మా** సీతకి, మనవరాలు పుట్టిందటండీ!... ఇందాకనే ఫోన్ చేసింది. ఈ రోజు తన కోడలికి పథ్యం పెడుతున్నారట. పదకొండోరోజు పుణ్యవచనం, బారసాల అట. మిమ్మల్ని, నన్ను రమ్మని చెప్పింది." అంది రామసీత భర్త సుబ్బారావుతో.

"తలాతోకా లేకుండా చెపుతావు.... ఎలా అర్థం అవుతుందీ? ఏ సీతకి మనవరాలు పుట్టిందో వివరంగా చెప్పు! సముద్రం ఒడ్డున పీతల్లాగా, మీ పుట్టింటివేపు ఇంటికో అరడజను సీతలున్నారు. చిన్న జడ సీత, చీపికళ్ళ సీత, కవల పిల్లల సీత, కలవల సీత, అనకాపల్లి సీతా, అమెరికా సీతా, ఇలా ముందూ, వెనకా ఓ కొండ గుర్తు పెడితే కానీ ఆ సీతని ఐడింటిఫై చేయలేం" అన్నాడు సుబ్రావు.

"అబ్బో! మీ ఎగతాళి చాల్లెండి. మీవేపు మాత్రం సుబ్బారావులని లెక్క పెట్టడం కంటే ఆకాశంలో చుక్కలని లెక్క పెట్టడం తేలికవుతుంది. మబ్బు సుబ్బు, గబ్బు సుబ్బు, గుంటూరు సుబ్బారావు, గుండు సుబ్బిగాడు... ఇలా లేరేంటీ?... మీ తాత పేరు అని చెప్పుకుని మీ సుబ్బులందరూ శుభ్రంగా మురిసిపోవడం లేదేంటీ? అలాగే... ఏదో, మా బామ్మ కడుపు చలవ. ఆ కడుపున పదకొండు మంది కొడుకులు, కూతుళ్లు పుట్టారు. అందరిళ్ళలోనూ మొదటగా పుట్టిన ఆడపిల్లకి, ' సీత' అనే పేరు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది... ఆ ప్రకారం నాకు, మా అమ్మమ్మ పేరు రామలక్ష్మిలో 'రామ' నీ, బామ్మ పేరులో 'సీత' నీ తీసి 'రామసీత' అని పెట్టారు. ఇప్పుడు ఆ పదకొండు సీతల మనవరాళ్ళకి కూడా ఆ సీత పేరే పెట్టాలని నిశ్చయించుకున్నాము. మన పెద్దాడి కూతురికి, 'సీత' అనే పెట్టించాను. చిన్నాడు కూడా తన కొడుక్కి, పెట్టింది... మీ పేరేగా! ఆ పేరుతో వాడిని పిలవాలంటే చచ్చేంత సిగ్గు ముంచుకొస్తుంది నాకు. ఇప్పుడు మా పెదనాన్న కూతురు సీత ఇంట్లో వచ్చిన మనవరాలికి ఆనవాయితీగా వచ్చే సీత పేరు పెడతారో... లేదో..." అంది రామసీత.

"ఆ చీపికళ్ళ సీత ఇంట్లో అనాదిగా వచ్చే ఆనవాయితీని బ్రేక్ చేసేసారుగా. ఆవిడ పెద్ద కొడుకు తన ఇద్దరు కవల ఆడపిల్లలకీ..




'వైతరణి' అనీ 'వైరాగ్య' అనీ పెట్టాడుగా... అవేం అప్రాచ్యం పేర్లూ... అర్థం పర్థం లేకుండా పెట్టాడుగా!" అన్నాడు సుబ్బారావు.

"మీ గుంటూరు సుబ్బారావు కూతురు తన పిల్లలకి పెట్టిన పేర్లు మరీ వింతగా ఉన్నాయి అని, మా వాళ్ళందరూ ఇప్పటికీ చెప్పుకుంటు న్నారు. కూతురి పేరు 'నిశ్శబ్ద'అనీ కొడుకు పేరు 'నిర్మొహమాట్' అనీ పెట్టారుగా!" అంది రామసీత.

"పోనీలే, వాళ్ళ కన్నా మన పిల్లలే నయం. మనసులో ఏమనుకున్నా, వాళ్ళ పిల్లలకి మన పేర్లే పెట్టారు."

"ఆ... అంత తేలిగ్గా ఊరికే పెట్టారేంటీ? ఆ ఇద్దరి మనవల పేరునా చెరో పదిలకారాలు సమర్పించుకుంటేనేగా మన కోడళ్ళు దిగి వచ్చారు.... లంచాలిచ్చి మనం బలవంతంగా మన పేర్లు పెట్టించినందుకు చుక్కలు చూపి స్తున్నారు."

ఇంతలో అక్కడకు– "ఏమేవ్! సీతా!... ఒసేయ్, ముచ్చు మొహందానా! ఎన్నిసార్లు పిలవాలే నిన్నూ?..." అంటూ పెద్ద కోడలు కోమలి వచ్చింది.

ఆ పిలుపుకి రామసీత కొయ్యబారి పోయింది.

"ఏంటమ్మాయ్! పెద్దంతరం, చిన్నంతరం లేకుండా అత్తగారిని పట్టుకుని అలా అనడ మేంటీ?..." అంటూ సుబ్బారావు కోడలు కోమలిని గదమాయించాడు.

కోమలి లెంపలు వేసుకుంటూ– " అయ్యో! రామా!... మామయ్య గారూ! నేను అత్తయ్య గారిని కాదండీ పిలిచింది... మీ మనవరా లిని... నా కూతురు సీతని! జడేస్తా రమ్మని ఇందాకట్నుంచి పిలుస్తున్నా రావడం లేదు. దాన్ని పిలుస్తోంటే... మీరు అత్తగారినను కుంటున్నారు. అందుకే అప్పుడే చెప్పాను... ఇలా మీ పేర్లు, మా పిల్లలకు పెట్టొద్దు అన్నా కూడా మీరే వినిపించుకోకుండా ఆనవాయితీ అంటూ మీ పేరు పెట్టించారు. ఇప్పుడు మేము మా పిల్లలని పిలిచినా, తిట్టినా మిమ్మల్నే అను కుని భుజాలు తడుముకుంటున్నారు" అంది.

"సుబ్బిగాడా! ఎక్కడ చచ్చావురా?... ఇక ఆటలు ఆపి స్నానం చేసి తగలడు..." అంటూ చిన్న కోడలు చిత్ర రంగప్రవేశం చేసింది.


"నేనిక్కడే చచ్చానమ్మా! నా స్నానం ఇందా కనే అయిపోయింది!" అన్నాడు సుబ్బారావు.

"మామయ్య గారూ!... అయ్యో! మీరు కాదండీ! అయినా మిమ్మల్ని ఎందుకు అంటా నండీ?... ఇదిగో ఈ సుబ్బిని పిలుస్తున్నాను. పొద్దస్తమానం ఆటలే... చదువూ సంధ్యా లేకుండా అడ్డగాడిదలా తయారవుతున్నాడు." అంటూ తన కొడుకు వీపు మీద ఛెళ్ళున ఒక్కటే సింది చిత్ర.

"చాలు తల్లీ చాలు!... నీకు ఇష్టమైతే రక రకాల ముద్దు పేర్లు... బంటీ, చింటూ, కన్నా, చిన్నా... అని పిలుస్తావు నీ కొడుకుని. కోపం వస్తే మాత్రం... ఒరేయ్ సుబ్బిగా! సుబ్రావూ! అంటావా?... ఇదంతా మీ మీ పిల్లలకి మా పేర్లు పెట్టమన్నామనేగా?... మీ కోపం అంతా ఇలా కక్కుతున్నారూ! ఇప్పుడైనా కొంపలు మునగలేదు. మీ ఇష్టం వచ్చిన పేర్లు పెట్టు కోండి... కానీ ఆ పేర్లు ఏవో కాస్త నోరు తిరి గేవీ, నోట్లో నానేవీ, మంచి అర్థమున్నవీ పెట్టు కుంటే అదే పదివేలు... నేములో ఏముందిలే? మా మీద ప్రేముంటే చాలు... మీకూ, మీ పిల్లలకీ." అన్నాడు సుబ్బారావు.

"ఔనండీ ! అయినా మన పేర్లు, మన పెద్దల పేర్లు పెట్టినా, పెట్టకపోయినా అర్థం, పర్థం లేని పేర్లు పెట్టకుండా ఉంటే చాలు. మన పేర్లు పెట్టి, వాళ్ళని తిడుతోంటే మనల్ని తిట్టి నట్టే ఉంటోంది... కావాలని అంటున్నారో, పొరపాటున అంటున్నారో కూడా తెలీడం లేదు." అంది రామసీత.

"అమ్మా, కోమలీ! చిత్రా! మీ పిల్లలకు మా పేర్లు వద్దు కానీ... మాకు కాస్త పేరు తెచ్చేలా పెంచండి చాలు! సీతా! ఇక సీతా సుబ్బారావు నామాలకి తిరునామం పెడదాం! ఇక చాలు." అన్నాడు సుబ్రావు.



విలేఖరి: హీరోయిన్‌గారూ! మీరు ఇంత పాపులర్ కావటానికి కారణం మీ డైరెక్టర్ గారా? లేక మీ నిర్మాతగారా? లేక మీ హీరోగారా?

హీరోయిన్: అబ్బే వాళ్లెవరు కాదండీ నా కాస్ట్యూమ్స్ డిజైనర్... ఆయనే నా సినిమాలు పెరిగే కొద్దీ డ్రస్సులను తగ్గించు కుంటూ వచ్చాడు. *–శ్రీను, భైంసా*

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# భౌ....భౌ...



ఆదోని భాషా
9440239828



నేను పెంచుకున్న కుక్కకు నేను పెట్టిన ముద్దు పేరు భౌభౌ.

అలా పిలవగానే అది తోక ఊపుకుంటూ నా దగ్గరికొచ్చేస్తుంది. ఆ కుక్క అంటే నాకు ప్రాణం. ఎందుకంటే ఈ ప్రపంచంలో మా ఆవిణ్ణి భయ పెట్టగల జీవి అదొక్కటే!

'మా ఆవిడ ఆనాటి సూర్యకాంతంకి చెల్లెలు లాంటిది. ఆమె నాలుక రెండువైపులా పదునున్న కత్తి. ఆ కత్తితో రోజూ నన్ను చీల్చి చెండాడేది. ఈ కుక్క రాకతో ఆమె హింసకు అడ్డుకట్ట పడింది.

ఓ రోజు పెరట్లో మా ఆవిడ నన్ను చెడామడా తిడుతుంటే... ఎక్కడినుంచి వచ్చిందో గాని ఈ కుక్క హఠాత్తుగా ఎంటరై కేకలేస్తున్న మా ఆవిణ్ణి గుర్రుగా చూస్తూ భీకరంగా మొరిగింది.

అంతే! మా ఆవిడ నోటికి తాళం పడింది. భయంతో ఇంట్లోకి పారిపోయింది.... నిజంగా అద్భుత దృశ్యమది. పదేళ్ళ సంసార జీవితంలో నేను సాధించలేనిది... ఈ మూగజీవి చిటికెలో సాధించింది. దాంతో నేనా కుక్కకి ఫిదా అయి పోయాను. దానికి కడుపునిండా తిండి పెట్టాను. ఆ రోజు నుంచి అది మా పెరట్లోనే వుంటూ మా ఆవిడతో పాటు నన్ను ఇబ్బంది పెట్టేవారందరి భరతం పట్టసాగింది.

ఉదాహరణకు మా పక్కింటి గుర్నాధం!

అతడొక పరాన్నజీవి. రహస్యంగా ఇతరుల వస్తువుల్ని వాడుకుంటాడు. రోజూ మేం నిద్రలేవక ముందే మా పిట్టగోడ దూకొచ్చి వరండాలో పేపర్ బాయ్ వేసిన మా పేపర్‌ని గబగబా చదివేసి వెళ్లి పోయేవాడు. కాని కుక్క వచ్చాక సీన్ మారింది. గుర్నాధం పిట్టగోడ దూకగానే భౌభౌ అతని కాలు పట్టుకుని కండ వూడొచ్చేలా కరిచింది. అతను కుయ్యో మొర్రో అంటూ ఆస్పత్రికి పరుగెత్తాడు.

సీన్ కట్ చేస్తే ఇప్పుడతను బుద్ధిగా పేపర్ కొని చదువుతున్నాడు.

మన దేశంలో కుక్కని కుక్కలాగే చూస్తారు. కాని అమెరికాలో కుక్కని మనిషిలా చూస్తారు. అమెరికన్లు తమ పిల్లల్ని పెంచటానికి బద్ధకిస్తారు. వారిని బేబీకేర్ సెంటర్‌కి అప్పగిస్తారు... కాని కుక్కల్ని మాత్రం ఇంట్లోనే వుంచుకుంటారు. వాటి

కోసం పెరట్లో డాగ్ హౌస్ కట్టిస్తారు. కుక్కలకి రోజూ బ్రష్ చేయిస్తారు. గోళ్ళు కత్తిరిస్తారు. స్నానం చేయిస్తారు.

కాని మన దేశంలో కుక్కలకి అంత సీన్ లేదు... మనం పరస్పరం తిట్టుకోవటానికే కుక్కల్ని వాడుకుంటాం.

'కుక్క బతుకు' కుక్క చావు' అంటూ మన దౌర్భాగ్యాన్ని కుక్కలపై నెట్టేస్తాం. 'కుక్క బుద్ధి, కుక్క తోక వంకర' అంటూ మన అవలక్షణా లన్నీ కుక్కలకి అంటగడతాం... ఇక మన సామెతల్లో కుక్కల్ని వాడుకున్నంతగా ఇంకే జంతువునీ వాడుకోలేదు. 'కుక్కలు చింపిన విస్తరి', కుక్కకాటుకి చెప్పుదెబ్బ', వూర్లో పెళ్లికి కుక్కల హడావిడి....ఇలా చెప్పుకుంటూ పోతే కుక్కల సామెతలు కోకొల్లలు.

యూరోపియన్లు కూడా కుక్కల్ని గౌరవి స్తారు. ఎవరైనా నమ్మకంగా పని చేస్తుంటే "నువ్వు కుక్కలా పని చేస్తున్నావ్" అని పొగుడు తారు. దానికి వారెంతో సంతోషిస్తారు. కాని అదే మాట మనదేశంలో ఎవరికైనా చెబితే వారు కుక్కలా మొరుగుతూ మనల్ని కరిచినంత పనిచేస్తారు.

ఏది ఏమైనా నేను చేరదీసిన కుక్క విశ్వాసం గా నాకు సేవ చేస్తోంది. మా ఆవిడ నాతో పోట్లాడితే చాలు భౌభౌ భీకరంగా మొరుగుతూ ఆమె మీదికొస్తుంది. కుక్క భయంతో మా ఆవిడ నాతో పోట్లాడడం మానేసింది.

భౌభౌ కారణంగా మా ఇంటికి దొంగలు రారు. చివరికి భిక్షగాళ్ళు కూడా భయపడ తారు. ఇక మేమందరం బయటకెళ్లినపుడు భౌభౌ ఇంటిని కంటికి రెప్పలా చూసుకుం టుంది. అలా భౌభౌ మా ఇంటికి జీతం అడ గని వాచ్‌మేన్‌లా విశ్వాసంగా సేవలందిస్తోంది. అయితే దాని విశ్వాసానికి ఓరోజు నేను భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని కలలో కూడా వూహించలేదు.

✦✦✦

ఆ రోజు ఆదివారం! ప్రతి ఆదివారం భార్యా పిల్లలతో కలసి సరదాగా ఏ సిన్మాకో, షికారుకో వెళ్ళటం నాకు అలవాటు. ఆ ఆదివారం కూడా ఎప్పటిలాగే ఇంటిని భౌభౌకి అప్పగించి మేం సిన్మాకి వెళ్లాం. అదొక కుక్కల సినిమా.

ఓ పెద్ద అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న మను షుల్ని కుక్కలు ఎలా కాపాడతాయన్నదే చిత్ర కథాంశం.

సిన్మా రసవత్తరంగా సాగుతున్నప్పుడు నా జేబులోని సెల్ మాటిమాటికి మోగసాగింది.

సిన్మా చూడ్డంలో లీనమై నేను ఫోనెత్తలేదు.

సిన్మా ముగిసాక అది మళ్లీ మోగినప్పుడు ఎత్తాను. అవతల మా పక్కింటి గుర్నాథం గొంతు విన్పించింది.

"రాంబాబుగారు! షార్ట్ సర్క్యూట్ వల్ల మీ ఇంటికి నిప్పంటుకుంది. ఫైరింజన్ వచ్చింది మీరు వెంటనే రండి!" అని చెప్పి ఫోన్ కట్ చేసాడు.

నా గుండె గుభేల్‌మంది. వెంటనే ఆగ




మేఘాల మీద ఇంటి దగ్గరికి చేరుకున్నాను.

అప్పటికే మా ఇల్లు మంటల్లో పూర్తిగా కాలి పోయింది. కాని ఫైర్ సర్వీసు వారు మంటల్ని ఆర్పకుండా ఇంటికి దూరంగా నిల్చొని చోద్యం చూస్తున్నారు.

నాకు ఒళ్ళు మండింది.

కోపంగా వారి దగ్గరికి వెళ్లి "అక్కడ నా ఇల్లంతా కాలిపోతుంటే మంటల్ని ఆర్పకుండా ఇక్కడేం చేస్తున్నారు?" అని నిలదీసాను.

ఫైర్ సర్వీస్ ఆఫీసర్ నా వైపు అసహనంగా చూస్తూ "మీరేనా ఇంటి ఓనర్? ఇంతసేపు మీరెక్కడున్నారు?... మేం వచ్చి చాలా సేప యింది. మంటల్ని ఆర్పాలని ప్రయత్నిస్తే మీ కుక్క మమ్మల్ని ఇంటి ఛాయలకూడా రానివ్వ లేదు. మావాళ్ళందర్నీ కండ వూడొచ్చేలా కరి చింది. చివరికి డ్రైవర్ని కూడా వదల్లేదు. ఇలాంటి కుక్కని మేమెక్కడా చూడలేదు. ఇల్లు మొత్తం కాలిపోయేవరకు ఇంటికి కాపలా కాసింది." అన్నాడు.

నాకు నోట మాట రాలేదు. తల దిమ్మె క్కింది. అంతలో హఠాత్తుగా నాకు జ్ఞానోదయ మయింది.

అవును! కుక్కను మనిషితో పోల్చలేం. కుక్కకి మంచిచెడుల గురించి ఎలా తెలు స్తుంది? ఫైర్ సర్వీసువారు మంటలార్పి తన యజమాని ఇంటిని కాపాడడానికి వచ్చారని దానికెలా తెలుస్తుంది? యజమాని ఇంటి దగ్గరికి ఎవరూ రాకుండా కాపలా కాయడ మొక్కటే దానికి తెలుసు. మంచిచెడుల జ్ఞానం వున్న మనిషే తన మూర్ఖత్వంతో సమాజానికి నష్టం కల్గిస్తుంటే ఆలోచనా శక్తి లేని ఆ మూగ జీవి నుంచి వివేచనని మేం ఎలా ఆశించ గలం?

అంతలో భౌభౌ నన్ను చూసి నా దగ్గరికి పరిగెత్తుకొచ్చింది. ఏమీ ఎరగనట్టు అమాయ కంగా నా బూట్లు నాకసాగింది.

ఫైర్ సిబ్బంది దానివైపు భయంగా చూడసాగారు.

'డాగ్ ఈజ్ గ్రేట్!...' నేను విరక్తిగా నవ్వు కున్నాను.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీల్లో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# బిరుదోపాఖ్యానం



కిలపర్తి దాలినాయుడు
9491763261

'కవితలరావు'కి నిద్రపట్టలేదు. అందుకు కారణం 'కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టు' అతగాడి చేతిలో సెల్ ఉండడమే కారణం.

ఇప్పుడు అతగాడు ఒక సెల్ లాంటి గదిలో తలూపుకొంటూ చేతులు కదుపుకుంటూ... పెరిగిన గెడ్డాన్ని, మాసిన జుత్తును గమనించలేదు. తనో ఏభైయైదేళ్ళవాడిననీ కూడా మరిచాడు. తన భార్య మాట వినడం మానేశాడు. ఎక్కడ నిల్చోమంటే అక్కడ నిలబడేవాడు. అలాంటివాడు కూర్చున్న చోటును ఎరువివ్వడం లేదు. అతనో రిటైర్ ఉద్యోగా?...కానేకాదు! మరి ఆఫీసుకు వెళ్ళడంటారా? వెళతాడు. పనిచేయడంటారా?... చేస్తాడు. కానీ అదేదో కొత్త అవయవంతో పుట్టినట్టు ఆ సెల్ ఫోన్ వదలడు. ఇందుకు కారణమైన వాళ్ళబ్బాయిని వాళ్ళావిడ నిత్యం ఫోన్ చేసి మరీ తిడుతుంది.

"ఏ వ్యసనం లేనోడు, ఇదేదో కొత్తవ్యసనం మీనాన్నకు నేర్పినట్టున్నావ్? నువ్వు ఆ సెల్ కొనియిచ్చిన నాటినుండి మీ డాడీకి నిద్ర లేనిరాత్రులెన్నో చెప్పలేను" అంటూ ఏకైక పుత్రుడనీ కూడా లెక్కించకుండా 'గణకుడ్ని' తిట్టింది. వాడి పేరు గణపతి. వాడి ఉద్యోగం గణన చేసే పని.

"అమ్మా!నాన్న మారాలి. ఇంకా ఆ డబ్బా ఫోను పట్టుకొని ఎన్నాళ్ళు డబడబలాడుతాడు. నుదిటిరాత చెరిగిపోయినట్టు దానిమీద రాతలన్నీ చెరిగిపోయాయి. అంకెలు కనబడవు. అక్షరాలు సరేసరి. పైగా కాలం మారింది. అన్నీ ఆన్ లైన్లోనే... నేను డబ్బులు పంపాలన్నా నాన్న నాకు డబ్బులు పంపాలన్నా... స్మార్టు ఫోన్ ఉండాలి. వీడియోకాల్ చేస్తే మీ అందర్నీ చూడాలి. పండగల ఫొటోలు మీరు నాకు షేర్ చేయాలి. ఇవన్నీ ఈ'సెల్'తోనే సాధ్యం." తన కారణాన్ని 'బిందె పగలుగొట్టి' నట్టు చెప్పాడు గణపతి.

ఇక అసలు విషయానికొద్దాం.

'తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్టు'ఒక దానికి కొన్న సెల్ మరొక దానికి వాడడం ప్రారంభమయ్యింది. అది ఏమిటయ్యా అంటే...వాట్సప్ గ్రూపులలో కవిత్వం రాస్తున్న వారిని చూసి రాయడానికి ప్రయత్నించడం.



అతనికి కొత్తగా పరిచయమైన కనబడని మిత్రుడు 'ఛాయారావ్'! కనబడడంటే వాట్సప్ ఐకాన్‌లో ఓ నల్లని బొమ్మే అతని ఛాయ అను కోవాలి.

కవిత్వం రాయడమెలా? అన్నగ్రూపు అడ్మిన్ అతడు. నూతన కవితా ప్రక్రియ 'డోకులు' సృష్టికర్త కూడాను... అందులో మనవాడు 'వాట్సాప్ నామాలు' దిద్దడం ప్రారంభించాడు.

తాను రాసిన తొలికవిత 'డోకులో డోకు' కు ఆ రోజు ఏభై కామెంట్లు రావడమే అతనికి తాను మంచి కవినని ఆత్మ విశ్వాసం పెరిగింది. అప్పుడే ఒక ప్రకటన ఆ డోకుల గ్రూపులో చూసాడు... "మీరు ఏభైసార్లు డోకితే... సారీ ఏభై డోకులు రోజుకొకటి గనక రాస్తే...మీకు 'అర్ధశతకవీశ్వర' బిరుదు ఇవ్వబడుతుంది" అంటూ ప్రకటించారు.

అప్పటినుండి ఏభైయ్యో రోజు వచ్చేవరకు ఆయన నిద్ర పోలేదు. తానురాసిన 'ఏభై న్యూసులు' సారీ ఏభై వార్తాకవితలు రాసేసాడు. సరిగ్గా అర్ధరాత్రి భారతీయ కాలమానం ప్రకారం ఓ రంగుల సన్మాన పత్రం కవితల రావుకు గ్రూపులో పోస్టు చేసారు గ్రూపు అడ్మిన్ ఛాయారావుగారు.

ఇక మన కవితలరావు ఆనందానికి అవధుల్లేవు. మన వాడు బంధువులందరికీ అదేరాత్రి వాట్సప్పుల్లో ఈ ఆనందకర పత్రాన్ని పంపాడు. పత్రంలో ఈతని ఫోటో,పేరు, భూతద్దంలో వెతుక్కోవలసిందే.

'డోకు' సంస్థ పేరు, నిర్వాహకుడి పేరు లారీ మీద పేర్లంత పెద్దవిగా కనబడుతున్నాయి. అసలు పత్రం తనదో కాదో తెలీదు. తన పేరుమీద వచ్చింది గనుక ఆనందం పట్టలేక పోయాడు.

ఫేస్‌బుక్‌లో పోస్టుచేసాడు. స్థానిక వార్తా పత్రికల్లో వచ్చినట్టు చేయగలిగాడు.

కవితలరావుకి అర్ధశత(చెత్త)కవీశ్వర బిరుదు' శీర్షికతో వార్తలు పత్రికలూ గుప్పించాయి.

మరో మెట్టు ముందుకు పోయాడు కవితల రావు.


ఆఫీసు స్టాఫుకు ఘన నక్షత్రాహార భోజనం పెట్టించాడు (స్టార్ హోటల్ ఫుడ్ అని కవి హృయం). వారు సన్మానానికి ఫ్లెక్సీ బిగించారు కార్యాలయ బృందం. నా బోటి ఓ ఏంకర్ తో కవితమీద వ్యాఖ్యానం చేయించారు. గజమాలతో సత్కారం. బంధు మిత్రులు వినాయకుడ్ని పత్రితో కప్పేసినట్టు శాలువాలతో కప్పేశారు.

ఊళ్ళో ఉన్న వారు నోళ్ళు వెళ్ళ బెట్టబోయి దోమలకు భయపడి మానేసారు. ఊరినిండా అభినందన ఫ్లెక్సీలు. కూడళ్ళలో కటౌట్లు.

'డోకుల'గ్రూపు కవితలరావుని అభినందిస్తూ మరో ఏభై 'డోకులు' గనుక మీరు ఎంత వేగం రాస్తే అంతవేగం 'జాతీయ డోకుల రత్న' బిరుదును ఇవ్వనున్నాము.చురుకైన మీకు మీ కవితలను రంగురంగుల చిత్రాలతో ముద్రించి సత్కారం చేస్తాం. ఇదీ ప్రకటన సారాంశం.

ఇప్పటికే లక్ష దాటేసిన ఖర్చు. పి.యఫ్.లోన్ బిరుదుపత్రం, పుస్తకం రిలీజుకు సంస్థకు కొంత ఆర్థిక సాయం అవసరమౌతుందని ఓ ఏభై వేలు అడ్వాన్సుగా పంపమని. త్వరలో వేదిక, తేదీ మొదలైనవి ప్రకటిస్తామని. ఈ క్రింది అకౌంటులోకి మొత్తం పంపమని సంక్షిప్త సందేశం.

గ్రూపుల్లో శతకం కవితల వీరునిగా సభ్యుల అభినందనలు.వెంటనే కొడుక్కి ఆ మెసేజ్ ఫార్వార్డు చేసాడు. తండ్రిమాట జవదాటని ఆ పుత్రుడు ఆ అకౌంటుకు డబ్బులు వేసాడు. అంతే. క్షణాలమీద గ్రూపులో "జాతీయ తొక్కలో రత్న"బిరుదును ప్రకటిస్తున్న రంగుల ప్రకటన వెలువడింది. రెండురోజులు పోయిన తరువాత అతన్ని గ్రూపునుండి రిమూవ్




పెట్టుకున్నాడు. ప్రతీ పైసాకూ ఇంటిదగ్గర ఖర్చు చెప్పే కవితలరావు ఈ విషయాన్ని ధర్మ పత్నికి తెలియనివ్వ లేదు. కవితల రావు కలం క్షణం ఆలోచనలో పడ్డాడు. కొడుకును అడిగితే పోలా అనుకొని ముందస్తు హామీ తీసుకు న్నాడు. అమ్మకు చెప్పకేం...అంటూ ఒట్టు వేసు కున్నాడు కూడా. ఇక చకచకా డోకులు రాయడం ప్రారంభించాడు.

కేవలం పదిరోజుల్లో పూర్తి అయ్యాయి.

అతగాడు గాలిలో నడుస్తున్నాడు. గ్రూపులో అభినందనలు అతన్ని క్రిందకు దిగనీయలేదు. ఇక ఈ సెంచరీకి రెండో బిరుదు రాబోతుంది. దాని కోసం పౌర సత్కారం ఏర్పాట్లలో పడ్డాడు.

ఇంతలో అడ్మిన్ నుండి ఫోన్ వచ్చింది. చేసాడు అడ్మిన్. ఫోన్ చేద్దామంటే ఎంతకూ కలవడంలేదు. పర్సనల్ నంబరు వాట్సప్‌నకు సమాచారం పంపుదామని తెరిచాడు.

అక్కడ వార్త అతన్ని మూర్ఛపోయేటంతటి పనిచేసింది.

"మీరిచ్చిన డబ్బు బిరుదు పత్రానికి, సన్మానానికి చాలదుగనక– సర్టిఫికేటు, బుక్ పంపుతున్నాము. ఇక గ్రూపు అడ్మిన్ కంట్రోలునకు తీసుకొనబడినది. మీరు ఈ గ్రూపు వైపు కన్నెత్తి కూడా చూడలేరు. హతవిధీ కవితలరావులో నిజమైనకవి అప్పుడు బయలు దేరాడు. మిగిలిన గ్రూపుల్లో ఈ మోసం విషయమై కవితలు రాసి ప్రచారం చేసే పనిలో పడ్డాడు.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# గుణపాఠం!



కె.వి. లక్ష్మణరావు
9014659041




"అమ్మా! పంకజం!... కొంచెం టీ పొడి ఉంటే ఇస్తావా?" పక్క వాటాలో ఉండే ఇంటి ఓనర్ కాంతం అడిగింది.

పంకజం కొంచెం మొహమాటంతో– "పిన్నీ! ఉన్నదే కొంచెం! మరి మీకెలా ఇవ్వడం?" ఉండీ లేదన్నట్టుగా క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతూ అంది.

కాంతం దర్జాగా కుర్చీ లాక్కుని కూర్చొంటూ– "ఏదో ఒంటరి ఆడదాన్నని, పెద్ద వయసులో ఉన్నాననీ ఓపిక లేక సరుకులు తెచ్చుకోలేక పోతున్నానే గానీ, ఆయన బతికున్నప్పుడు మా ఇంట్లో టీ, కోనసీమలో కాలువ నీరులా ప్రవహించేదంటే నమ్ము. లెక్కలేనన్ని టీ కప్పులు మా ఇంట్లో కుప్పలు కుప్పలుగా పడి ఉండేవి ప్చ్! ఇప్పుడే ఇలా! ఇదంతా నా ఖర్మమ్మా! 'టీ' తాగకుండా ఉండలేను. ఏదో 'టీ' సర్దుకోలేను. అయినా ఒక్క విషయం చెప్పనా పంకజం?"

ఇప్పటివరకూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతూనే, ఒక్క విషయం అంటుందా? ఆడ గజనీ మహమ్మద్‌లా ఏదో ఒక సరుకు కోసం రావడం...లేదంటే 'మా తాతలు నేతులు నాకారు. మా మూతులు వాసన చూడండి." అన్నట్టుగా కోతలుకోయడం కాంతానికి అలవాటే.

"ఏం అమ్మాయ్! ఆలోచనలో పడ్డావ్? పోనీ టీ పొడి తక్కువుంటే ఆ పొడితోనే మనిద్దరికీ నీ చేత్తో 'టీ' పెట్టు సరిపెట్టుకుంటాను."

మళ్ళీ పాల ఖర్చు దండగనుకుంటూ ఉన్న టీ పొడి కాంతానికి ఇచ్చేసింది పంకజం.

"వస్తానమ్మాయ్" అంటూ కదిలింది కాంతం.

"మళ్ళీనా?" అంది నెమ్మదిగా పంకజం.

"ఏమన్నావ్?!" అడిగింది కాంతం సరిగ్గా వినపడక.

"అబ్బే! వెళ్లిరండి" అన్నాను."

సరిగ్గా నెల క్రితం తనకు హెడ్ గుమస్తాగా ప్రమోషన్ రాబట్టే కదా! ఉన్న ఊరు, కట్టుకున్న ఇల్లు వదిలి ఇంతదూరం వచ్చిందీ; ఈవిడింట్లో పడింది. ఈ ఊరు వచ్చి అద్దె ఇల్లు కోసం వెతికేటప్పుడు ఆఫీసు వాళ్ళు తనతో 'పంకజంగారూ!' ఈ ఊరిలో ఎవరింట్లోనైనా అద్దెకు ఉండొచ్చు కాని పొరపాటున కూడా కాంతంగారి పక్క

వాటాలోకి వెళ్ళకండి" అన్నారు.

ఏం అద్దె ఎక్కువడుగుతుందా? అడిగింది.

"లేదండీ! ఆమె చెప్పే కోతలు భరించలేరు. ఆమెకు పీనాసితనం కూడా ఎక్కువే. కొరివితో తల గోక్కోవడం, ఆ ఇంట్లోకి వెళ్ళడం ఒక్కటే." చెప్పారు ఆఫీసువాళ్ళు.

కానీ పంకజానికి ఏ ఇల్లూ నచ్చలేదు.

'ధైర్యే! సాహసే! పంకజం!!' అనుకుంటూ కాంతం పక్క వాటాలోకి అద్దెకి దిగిపోయింది. అంతేకాదు కాంతం అడిగినట్టుగా ఇల్లు సంవత్సరం వరకూ ఖాళీ చేయనని అగ్రిమెంట్ కూడా రాసింది. కానీ ఈ కాంతం కోతల 'గృహహింస' తట్టుకోలేకపోతోంది పంకజం.

మరునాడు ఉదయమే "అమ్మా! పంకజం! ఓ బుల్లి గిన్నెతో బియ్యం ఇస్తావా?..." తన సహజ ధోరణిలో అడిగేసింది కాంతం.

ఇవ్వకపోతే తననే వంట చేయమంటుందన్న బెంగతో "అలాగే ఉండండి ఇస్తానంటూ లోపలకు వెళ్లి బియ్యం తెచ్చింది పంకజం.

"ఇప్పుడైతే ఒంటరి ఆడదాన్ని, పెద్దవయసు దాన్ని కావడం చేత ఇలా నిన్నడుగుతున్నానే గానీ, ఆయన ఉన్నప్పుడు గోదారి చుట్టూ ఇసుకలా మా ఇంట్లో ఎప్పుడూ అన్నం ఉడుకుతూనే ఉండేది... మా ఇంట్లో పొయ్యి మీద పిల్లులు ఎప్పుడూ పడుకోలేదంటే నమ్ము!..." కోతలు కోసింది కాంతం.

"అలాగా పిన్నీ!" రాని నవ్వును పెదాలపై పులుముకుంటూ అంది పంకజం.

"ఏమిటమ్మాయ్! బియ్యం ఇచ్చావు కదా! ఇంకేంటి ఆలోచిస్తున్నావ్? ఆఫీసుకు టైం అవుతోంది. సమయపాలన పాటిస్తే మంచిది ఎవరికైనా. ఆ రోజుల్లో మావారు 'నన్ను చూసి గడియారం తిరుగుతుందని మెచ్చుకునే వారు' అంటూ ముందుకు నడిచింది కాంతం.

✦✦✦

రోజూ కాంతం పంకజాన్ని సరుకులు అడగడం మానలేదు. ఆమెలో మార్పులేదు. ఆలోచించి, ఆలోచించి పంకజమే మారింది.

"అమ్మా! పంకజం! టీపొడి వుందా? ఎప్పటిలా అడిగింది కాంతం.

"అయ్యో! పిన్నిగారూ!... మొహమాటం వద్దండీ కావల్సినంత పట్టుకెళ్ళండి" అంటూ ఆప్యాయంగా అడిగిన సరుకులన్నీ ఇచ్చేసరికి కాంతం ఆశ్చర్యపోతూ చూసింది.

"అమ్మాయ్! నేను అంతే, చేతికి ఎముక లేకుండా అడిగిన వారికి లేదనకుండా, కోరిన వారికి కాదనకుండా ఇచ్చేసేదానిని. మా నాన్న గారు నన్ను మెచ్చుకుంటూ అచ్చం నా పోలికే అనేవారు." మళ్ళీ కోత కోసింది.

ఆరు నెలలు సాహసం చేస్తే వాళ్ళు వీరవు తారట... నా సావాసంతో నీకు నా బుద్ధులే వస్తున్నాయి మంచిది" అంది కాంతం.

"అంతా మీ అభిమానం పిన్నిగారు" అంది పంకజం.

రెండు నెలలు గడిచాయి.

✦✦✦

"ఇదేమిటీ!?" అంటూ నిర్ఘాంత పోయింది.

"బిల్లులు పిన్నిగారూ!" అంది పంకజం.

"బిల్లులిచ్చి డబ్బులంటావా?..."

"అవును పిన్నిగారూ!... ఇన్ని రోజులకూ మీకైన కిరాణాఖర్చుల వివరాలు లెక్క కడితే, అద్దె డబ్బులు పోను, నాకే బ్యాలెన్స్ వస్తుంది.

"మంచితనంతో ఇచ్చావనుకున్నాను!" దెబ్బ తిన్నట్టుగా చూస్తూ అంది కాంతం.

"నేనూ అలాగే ఇద్దామనుకున్నా పిన్నిగారూ! కానీ కిరాణా కొట్టువాడు నేను మంచిదాన్నని తెలిసినా సరుకులకు డబ్బులు తీసుకున్నాడు. వాడు తీసుకోకపోతే మీవద్ద తీసుకోను... నా చిన్నతనంలో మా నాన్న చిత్తు కాగితం అడిగితే వెంటనే నోట్స్‌లో కాగితం పరపరమంటూ




ఆ రోజు ఒకటో తారీఖు.

"అమ్మాయ్! ఉద్యోగంలో పడి నా ఇంటి అద్దె ఇవ్వడం మరిచినట్టున్నావ్?" అద్దె ఇచ్చే వరకూ ఇక్కడ్నుంచి కదలను అన్నట్టుగా అక్కడే కూర్చుండి పోయింది కాంతం.

"అయ్యయ్యో! మీరన్నది నిజం పిన్నిగారూ! ఇప్పుడే మీ అద్దె పువ్వుల్లో పెట్టిస్తాను. పువ్వుల కోసమే చూస్తున్నాను" అంటూ లోపలకు వెళ్లి కొంతసేపటికి తిరిగొచ్చి- "ఇవిగో మీ అద్దె డబ్బు"లంటూ ఓ పెద్ద కాగితం... ఓ రెండు పువ్వులు, నాలుగు బిల్లులు కాంతం చేతిలో పెట్టింది పంకజం. ఆ బిల్లులను చూసి తెల్ల బోయిన కాంతం, మొహం మాడిపోయిన మసాలా దోసెలా అయిపోయింది.

చింపి ఇచ్చాను. అందుకు మా నాన్న నాకు రూపాయి ఇచ్చారు. నీది అచ్చం నా పోలికే అంటూ మెచ్చుకున్నారు కూడా! మా పాలేరుకు జీతం లేదు. రైతులకు కోపం లేదు! అనే టైపు, మహాజాలిగుండె మా నాన్నది! నాకు ఆయన పోలికే వచ్చింది." పంకజం కోసిన కోతలు, తిరిగి గోడకు కొట్టిన బంతిలా తన వైపు వచ్చేసరికి 'ఊరుకున్నంత ఉత్తమం లేదు- బోడిగుండంత సుఖం లేద'నుకుంటూ బిల్లులతో అక్కడ్నుంచి జారుకుంది కాంతం.

'తాడిని తన్నేవారుంటే, వారి తలను తన్నే వారుంటారు సుమా! హమ్మయ్య! కోతలపోరు ఇంక వుండదు' అనుకుంటూ తృప్తిగా తనింట్లోకి నడిచింది పంకజం.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# జిందాబాద్ ... జిందాబాద్.



ఈతకోట సుబ్బారావు
9440529785




**అంతా** నిశ్శబ్దం....

అది ట్రంకు రోడ్డు కాదు... టౌన్ హాలూ కాదు.... అది కోర్టు! అందులోనూ హైకోర్టు. మూడో అంతస్తులో ప్రజాప్రయోజనాల సంబంధిత కేసులు చూసే అత్యంత కీలకమైన బెంచి.

అప్పటికే ఆ కోర్టు హాలు అంతా జనంతో క్రిక్కిరిసి ఉంది. అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. దానికి కారణం లేకపోలేదు రాష్ట్ర స్థాయిలో కాదు... దేశ స్థాయిలో కూడా ఈ కేసు సంచలనం రేపుతూ ఉంది. అన్ని పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియాతో సహా ప్రజలు అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రోజే తుది తీర్పు ఎలాంటి తీర్పు వస్తుందోనని లక్షల టీవీలు ఆన్‌లో ఉన్నాయి. అక్కడ స్థలాభావం వల్ల కోర్టు ప్రాంగణంలో కొన్ని వందల మంది ఉన్నారు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియాకు లోనికి ప్రవేశం లేదు కాబట్టి కెమెరాలతో వీడియోలతో సిద్ధంగా బయట కాచుకు కూర్చున్నారు. పదిన్నర కావస్తుంది.

అప్పుడే సింగిల్ బెంచ్ న్యాయమూర్తి లోనికి ప్రవేశించారు. అక్కడ గుండుసూది పడినా శబ్దం వినిపించేంతగా నిశబ్దం ఆవరించి ఉంది. ప్రాసెస్ సర్వర్ వచ్చి న్యాయమూర్తిగారి వెనుక నిలబడ్డారు. ఒక్కసారి న్యాయమూర్తి కోర్టు నలువైపుల చూశారు.

పిటిషనర్ తరుపున వాదించే న్యాయవాది కనిపించలేదు. అప్పటికే న్యాయమూర్తి రెండు వాయిదాలు ఇచ్చారు. మధ్యలోనే కేసు వదిలేసి వెళ్లిపోయారా? ఎవరైనా కొనుగోలు చేశారా? ఏమైంది??!! ఎందుకు రాలేదు? అందులోనూ తుది తీర్పు వాయిదాలకు రాలేదు! ఇలా రకరకాల చర్చలు వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. న్యాయమూర్తి ప్రాసిక్యూటర్ వైపు ఏమిటి అన్నట్టు అని కళ్లతోనే ప్రశ్నించారు.

"సార్! పిటిషనర్ తరపున న్యాయవాది హాజరు కాలేదు. ఎలాంటి ముందస్తు సమాచారం కూడా లేదు యువరానర్." అని చెప్పడంతో న్యాయమూర్తి తన రికార్డును అప్డేట్ చేసుకున్నారు.

వెంటనే పిటిషనర్‌ను ప్రవేశపెట్టమని చెప్ప టం మరో నిమిషంలో సుబ్బారావు కోర్టు బోను లో నిలబడిపోయాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి "మీ న్యాయవాది ఆబ్సెంట్ అయ్యాడు అంటే కేసును విత్ డ్రా చేసుకున్నట్టు అని చెప్పడమేగా!" అడగటంతో ఒక్కసారి కోర్టులోని ప్రజలందరూ విస్తు పోయారు.

బోనులో ఉన్న సుబ్బారావు న్యాయమూర్తి వైపు చూస్తూ "అయ్యా! వారు ఎందుకు రాలే దనేది నాకు తెలియటం లేదు. ఉదయం కూడా 'నేను వస్తున్నాను నువ్వు పద' అన్నారు కానీ వారు రాకపోయినా మీరు నాకు అవకాశం ఇస్తే తుది రోజు కాబట్టి, మీది తుది తీర్పు వస్తుంది కాబట్టి, నా రెండు వాక్యాలుకు వ్యవధి ఇవ్వండి సార్.అనుమతి ఇవ్వండి చాలు. నేను చెప్పే మాటల్లో నిజాయితీ లేదంటే కేసు వాపసు తీసుకొని వెళ్ళిపోతాను సార్." అని సుబ్బారావు వినయంగా నిజాయితీగా తనకు వచ్చిన భాష యాసలో చెప్పటం అందరినీ ఆకట్టుకుంటే న్యాయమూర్తిని ఆలోచింప చేయటంతో– "ఏం చెబుతారో చెప్పండి!" అని ఆదేశించారు.

సుబ్బారావు ఊపిరి గట్టిగా పీల్చుకొని–

"సార్ ఇది తప్పో ఒప్పో నాకు తెలియదు కానీ ఈ పత్రికలు కార్టూనిస్టులు చిత్రకారులు రచయితలు వీరందరూ కూడా సుబ్బారావు పేరును ఒక హాస్యపు గుళికగా హాస్యానికి నమూనాగా, వ్యంగ్యానికి ప్రతీకగా భావిస్తు న్నారు సార్...ఏ పత్రిక చూసినా సుబ్బారావు పేరును అపహాస్యం చేసే కార్టూన్లు కథలు, జోక్స్, వ్యంగ్యరచనలతో అవమానపరుస్తు న్నారు... ఎక్కడా చూసినా సుబ్బారావు పేరును చులకనగా చూపే పాత్రధారులుగా సృష్టించి అవహేళన చేస్తున్నారు. ఇది ఒకటే నా బాధ సార్ అని చెబుతున్న సుబ్బారావుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడ్డు తగిలారు.

"మీరు ప్రభుత్వం మీద పిల్ వేసి కోర్టుకు వచ్చిందే దానికోసం. ఇప్పుడు మీరు ఏం చెప్ప దలచుకున్నారో సూటిగా చెప్పండి" అని గట్టిగా మందలించడంతో, సుబ్బారావు కొంత తత్తర పడినా, గొంతులో తడి నింపుకొని–

**మాటల గారడీ**



**'ఆ కట్టు' కోవడమేమిటి?... చీర యిలా కట్టుకుంటే 'ఆ కట్టు' బొట్టుతో 'ఆకట్టు' కోవచ్చు 'ఆ కట్టు' కోబోయే వాడిని.**

**✦✦✦**

**"సారా" అంటే...**

**'సా'యంత్రం నుండి 'రా'త్రంతా తాగుతూనే ఉండేది.**

**-కో.నా.వె. ఆంజనేయులు**

"న్యాయమూర్తి సార్! సుబ్బారావులు ఎంతో మంది, ప్రపంచంలో, దేశంలో తెలుగునాట పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ఎందరో ఉన్నారు సార్! కేవలం వెకిలి హాస్యం పేరుతోనే అపహాస్యం చేయడం సబబుగా లేదు సార్! ప్రపంచానికి ఏటీపీ మెడిసిన్ అందించిన ఎల్లా ప్రగడ సుబ్బారావు, మెడికల్ ఛైర్మన్‌గా పని చేసిన కాకర్లసుబ్బారావు,రంగస్థలానికి పర్యాయ పదంగా నిలిచిన గోవింద రాజుల సుబ్బారావు, 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా...' అంటూ ఉత్తేజపరిచిన రాయప్రోలు, సినిమారంగంలో దర్శకులుగా విలువలు కాపాడిన ఆదుర్తి సుబ్బా రావు, ఎన్టీఆర్‌ను పౌరాణిక రంగం వైపు తిప్పిన బి.ఎ.సుబ్బారావు, చీఫ్ జస్టిస్‌గా పనిచేసి, ఆ తర్వాత రాష్ట్రపతిగా కూడా పోటీ చేసిన కోకా సుబ్బారావు, తెలుగు సాహిత్యంలో ఎంకి నాయుడు బావ లాంటి సజీవ పాత్రలను పరి చయం చేసిన నండూరి సుబ్బారావు, స్వాతంత్ర సమరయోధుడు పాత్రికేయుడు ఖాసా సుబ్బా రావు, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు, హరిశ్చంద్ర పాత్రను సజీవంగా ఇప్పటికీ కళ్ల ముందు ఉంచిన హరిశ్చంద్ర పాత్రధారి ప్రముఖ రంగస్థల నటుడు డి.వి.సుబ్బారావు ఇలాంటి మహాను భావులు ఎంతోమంది సుబ్బారావులు ఉన్నారు సార్!... వీరందరినీ మర్చిపోయి ఒక్క సుబ్బా రావు పేరును హాస్యానికి, వ్యంగ్యానికీ బఫూన్ గా ఈ పత్రికలు కార్టూనిస్టులు రచయితలు వాడుకోవటం నేను జీర్ణించుకోలేక దాదాపు రెండేళ్ల నుంచి కోర్టులో పోరాడుతున్నా సార్. రేపటి తరానికి సుబ్బారావు పేరుకు విలువ ఇవ్వాలని వారిని, ఆ పేరును గౌరవంగా వాడు కోవాలని నా విన్నపం... నా అభ్యర్థన! ఇక నేను చెప్పాల్సింది చెప్పాను సార్ మీ తీర్పు కు మాత్రం నేను కట్టుబడి ఉంటాను సార్. నమస్కారం సార్!" అంటూ కోర్టు బోనులోనే దీనంగా రెండు చేతులతో నమస్కరించిన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ఆలోచింప చేస్తుంది.

ఒకపక్క సుబ్బారావు వేదన, వాదన ముగి యగానే కోర్టు నలువైపులా హర్షధ్వానాలుతో దద్దరిల్లింది. న్యాయమూర్తి సైలెన్స్ సైలెన్స్ అంటూ తన చేతి ఆయుధంతో పెద్దగా రెండు సార్లు వారి పొడాగాటి టేబులుపై కొట్టి పెద్ద శబ్దం చేశారు.

అంతా నిశ్శబ్దం. అంతా మౌనం.

న్యాయమూర్తి గొంతు సవరించారు.

న్యాయమూర్తిలో ఏదో దృఢ సంకల్పం స్పష్టంగా కనిపిస్తుంది.

న్యాయమూర్తి గొంతు సవరించారు.

ఈ కేసు పూర్వాపరాలు అన్ని విచారించిన తర్వాత పిటిషనర్ వాదనలలో కూడా నిజా యితీని యధార్థాన్ని గమనించి తీర్పును మూడు నెలలు రిజర్వ్ చేస్తున్నాము. ఈ మూడు నెలలపాటు పత్రికల మీద రచయితల మీద కార్టూనిస్టుల మీద ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఆ నివేదిక కూడా పరిశీ లించి తీర్పు వెలువడుతుంది. అప్పటి వరకు ఈ పేరును ఎక్కడ కూడా అపహాస్యం వాడుకో కూడదు. అలా అపహస్యం జరిగితే కఠిన శిక్షార్హులు."అని కోర్టును ముగించి వెళ్లారు న్యాయమూర్తి.

అంతా నిశ్శబ్దం.

కోర్టు నుంచి అందరు బయటకి వస్తున్నారు ఆనందంగా.

సుబ్బారావు మాత్రం– "జిందాబాద్ జిందా బాద్ సుబ్బారావులూ... జిందాబాద్" అను కుంటూ వేగంగా వస్తున్నాడు బయటకు.

శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన

మినీ హాస్యకథల పోటీల్లో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# వినకు...వినకు...






కోనే నాగ వెంకట ఆంజనేయులు
9290660220

“ఏమండోయ్ శ్రీవారూ!... ఒక చిన్న మాట.”

“నాతోనేనా? లేక పాట పాడుకుంటున్నారా శ్రీమతి గారూ!”

“పాట కాదు మహానుభావా!... మీతోనే అంటు న్నాను యిది విన్నారా అని?”

“ఏ విషయమైనా నువ్వు చెప్పకుండా నేనెప్పు డైనా విన్నానా భా...మినీ!”

“చాల్లెండి. కాస్త పొట్టిగా ఉన్నంత మాత్రాన మినీ అనేయాలా?”

“అంతలా బాధ పడకోయ్!... మేధావులంతా పొట్టి వాళ్లే తెలుసా?”

“ఇంక ఆపి నేను చెప్పేది సీరియస్‌గా వినండి!”

“సరే. సీరియస్ గానే వింటాను... ఒకటొకటి కక్కేయ్... సారీ... చెప్పేయ్.”

“ఆ శివాలయం దగ్గరున్న నీరజ మీకు తెలుసు కదా?”

“అప్పుడెప్పుడో నీ పుట్టిన రోజున మనం శివా లయానికి వెళ్ళినప్పుడు నువ్వు దూరం నుంచి చూపిస్తే చూశాను అంతే తప్ప యింకే విధంగానూ నాకు ఆవిడతో ఏ పరిచయమూ లేదు.”

“జోకులొద్దన్నానా!...సీరియస్‌గా వినండి.”

“సరే... సరే... చెప్పు! ఆవిడకేమైంది?”

“ఆవిడకి ఏమీ కాలేదు కానీ ఆవిడ వాళ్ల అత్త గారిని సరిగ్గా చూడదటండీ.”

“ఏం పాపం!... కళ్ళు సరిగ్గా కనిపించవా?”

“ఆ జోకులే వద్దనేది... ఆ నీరజ వాళ్ళ అత్త గారిని సరిగ్గా చూ... వాళ్ళ అత్తగారి పట్ల మర్యా దగా ప్రవర్తించదటండీ.”

“అలాగా!!”

“అలా తేలిగ్గా తీసుకుంటారేమిటండీ. ఇంటెడు చాకిరీ ఆవిడతోనే చేయిస్తుందట ఆ మహాతల్లి. భర్త పోయిన పెద్దావిడని సేవలు చెయ్యాలి గానీ... ఆవిడతోనే సేవలు చేయించుకోవడమేమిటండీ?”

“నన్నడుగుతావేంటి?”

“భర్త పోయి ఆవిడ కొడుకు ఇంటికి వచ్చేయ గానే పనిమనిషిని కూడా మానిపించేసి యింటి పనంతా ఆవిడ మీదకు నెట్టేయడమే గాక తిండి కూడా సరిగ్గా పెట్టదట! అంతే కాదండోయ్. వాళ్ల ఆయన్ని కూడా సరిగ్గా చూడదంట!”

"ఏం చేస్తుందట ఆయన్ని?"

"ఆయన్ని పదిమందిలోనూ హీనంగా చూస్తుందట... అన్నట్టు మరో సంగతి చెప్పడం మర్చిపోయానండోయ్...."

"మర్చిపోవడమేం.... చెబుతున్నావుగా.... కానీయ్!!"

"వాళ్ళమ్మగారు ఎప్పుడు వాళ్ళింటికొచ్చినా ఏడ్చుకుంటూ తిరిగి వెళతారటండి."

"అదేం? వాళ్ల అమ్మని కూడా సరిగ్గా చూడదటా ఆ నీరజ?"

"వాళ్ళమ్మని ఆవిడ బాగానే చూస్తుందటండీ. వాళ్ళాయనే సరిగ్గా చూడడట. అందుకే ఆవిడ ఏడ్చుకుంటూ తిరిగి వెళుతుందట."

"ఏం చేస్తాడట ఆవిడని అల్లుడు?"

"ఆవిడ వచ్చినప్పుడల్లా... దుమదుమలాడుతూ, రుసరుసలాడుతూ, కోపంగా ఆవిడ ఎప్పుడు వెళ్లిపోతుందా అన్నట్టు చూస్తాడట."

"ఎప్పుడొచ్చినా అలానే చూస్తాడటనా?"

"అవునటండీ!"

"అయిపోయాయా ఇంకా ఏమైనా మిగిలి పోయాయా కక్కా... సారీ... చెప్పాల్సినవి?"

"అన్నట్టు యింకోటుందండోయ్. రాక రాక ఏ ఏడాదికో, రెండేళ్ళకో చుట్టం చూపుగా వచ్చే ఆడపడుచుకి కాస్త పసుపు, కుంకుమ కూడా పెట్టదటండీ."

"అది సరే గానీ యింతకీ ఈ విషయాలన్నీ నీకెలా తెలిశాయి?"

"మనకి నాలుగిళ్ల అవతలున్న కోమలి చెప్పిందండీ."

"అంటే ఈ సంగతులన్నీ నీ అంతట నువ్వు తెలుసుకున్నవి కావు ఆ కోమలి చెబితే తెలిశాయన్న మాట."

"అవునండీ! లేకపోతే నా అంతట నాకు ఎలా తెలుస్తాయండీ ఎవరూ చెప్పకపోతే?"

"ఆ కోమలికి ఎలా తెలిశాయి ఇవన్నీ?"

"కోమలి నీరజ ఒకళ్ళింటికి ఒకళ్లు వస్తూ పోతూ ఉంటారటలెండి."

"అలాగా! అయితే ఆ కొడవలి... కాదు... కాదు... ఆ కోమలి చెప్పిన సంగతులన్నీ నిజమని నువ్వు నమ్ముతున్నావా శ్రీమతీ?"

"అవునండీ! తను అబద్ధమెందుకు చెబుతుంది?"

"నీరజ గురించి నీకు చెబుతున్నట్లే... నీ గురించి కోమలి ఆ నీరజతో చెడుగా చెబుతున్నదేమో అని నీకు ఎప్పుడైనా అనుమానం వచ్చిందా బుజ్జీ?"

"నా గురించా? ఏముందని చెబుతుంది?"

"ఏమీ ఉండక్కరలేదోయ్. స్వంతంగా కల్పించి చెబుతున్నదేమో...నీరజ గురించి నీకు చెడుగా చెప్పినట్టు."

"అంటే కోమలి, నీరజ గురించి చెప్పినవన్నీ అబద్ధాలంటారా?"

"ఎందుకు కాకూడదు? ఎదుటి వాళ్ల గురించి చెడుగా చెప్పి ఆనందించడం కొందరికి హాబీ... అలా చెప్పకపోతే వాళ్ళకి తిన్నది అరగదు."

ఏమి చెప్పినా కూడా నమ్మకూడదు."

"ఎప్పుడైనా నీ స్వంత కళ్ళతో చూసిందీ, స్వంత చెవులతో విన్నది మాత్రమే నమ్ము. తెలిసిందా?"

"బాగా తెలిసిందండీ."


"సరే అసలు విషయం చెబుతాను విను.".

"అసలు విషయమా? ఏంటండీ అది?"

"నీరజ గురించి కోమలి చెప్పినవి అన్నీ ముమ్మాటికీ పచ్చి అబద్ధాలు".

"మీకెలా తెలుసు? నీరజతో మీకు అసలు పరిచయమే లేదన్నారుగా?"

"అవును! నాకు ఆవిడతో ఏ పరిచయమూ లేదన్న మాట నిజమే. కానీ వాళ్ళాయనతో పరిచయం లేదనలేదుగా."




"అవునాండీ?!..."

"కాదా మరి! అన్నట్టు అల్లుడు సరిగ్గా చూడక పోయినా నీరజ వాళ్ళ అమ్మ నెలనెలా ఎందుకు వస్తుందసలు అల్లుడింటికి?"

"నిజమేనండోయ్! నేను అంత దూరం ఆలోచించ లేదు."

"మా ఆడపడుచుకి నేను చీరా, జాకెట్టు పెట్టలేదని ఎవరూ గొప్పగా చెప్పుకోరు కదా. పెట్టక పోయినా పెట్టేనని గొప్పగా చెప్పుకుంటారు గానీ... అవునా?!"

"నిజమేనండోయ్!!"

"అందుకే మనకి చిన్నప్పటినుంచే చెబుతారు స్కూల్లో – చెప్పుడు మాటలు వినకూడదు అని... అర్థమైందా?"

"బాగా అర్థమైందండీ. ఇకనుంచీ కోమలి

"ఆయన మీకెలా పరిచయమండీ?"

"ఎలా అంటే... మేము యిద్దరం బాల్య మిత్రులం కాబట్టి. ఇంకా ఇప్పుడు యిద్దరం ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం కాబట్టి."

"అవునా!!"

"అవునండీ! ఔను!! ఇంకా మనం రేపు వాళ్ళింటికి వెళుతున్నాం. నువ్వే చూస్తావుగా ఆవిడ మంచితనం. నీకింకా అనుమానాలేమైనా మిగిలి ఉంటే అవి కూడా తీరిపోతాయిలే రేపు అక్కడ."

"అలాగేనండీ! తప్పకుండా వెళదాం. పాపం చెప్పుడు మాటలు విని అనవసరంగా ఆవిణ్ణి చెడ్డగా ఊహించుకున్నాను... రండి యిక భోంచేద్దాం".

"పద! మా చెడ్డ ఆకలిగా ఉంది."

# నాలుగు రీతులు... ఒకే సబ్జెక్ట్... నాలుగు కార్టూన్లు!

**హాస్యానందం 'ఫుల్‌పిల్లర్' బ్నిం సోషల్ మీడియాలో సంధించిన ఒక ప్రశ్నకి ప్రముఖ కార్టూనిస్టు శ్రీజయదేవ్‌గారు సోషల్ మీడియాలోనే సమాధానమిచ్చారు. కార్టూనిస్టులకు ఉపయోగకరంగాఉంటుందని దీన్ని ప్రచురిస్తున్నాం!**

**ప్రశ్న: సజెస్టివ్, సింబాలిక్, ఎగ్జాజిరేట్, ఆబ్‌స్ట్రక్ట్, ఈ నాలుగు కళారీతులులో, ఒకే సబ్జెక్ట్ మీద నాలుగు కార్టూన్లు వేయగలరా ప్లీజ్?**

**నా**కు బ్నిం చాలా పెద్ద పరీక్ష పెట్టారు. చిత్రకళారీతులన్నింటినీ అధ్యయనం చేసిన దిట్ట. ఆయనకి విడమర్చి చెప్పే ధైర్యం నాకు లేక పోగా, అయిడియా తట్టలేదు. పైగా, ఒకే కార్టూనుతో, నాలుగు సబ్జెక్టుల వివరణలా.... ఎలా?

సరే, ముందుగా, ఈ ఆంగ్ల పదాలకు, అర్థాలు తెలుసుకుందాం.

1. Suggestive: సూచించు.
2. Symbolic: చిహ్నం ఆధారంగా. (ఇదే సరైన పదం అనుకుందాం)
3. Exaggerated: అతిశయోక్తిగా.
4. Abstract: నైరూప్యంగా (అంటే రూపం...నై!) అన్నమాట!

సాహసించి గీశాను. అర్థమైంది అని మాత్రమే గాక, మెచ్చుకున్నారు కూడా.

ఈ కార్టూనులో, సూర్యుడు, మేఘాలు, గొడుగు, మనిషి లని ప్రధాన వస్తువులుగా తీసుకున్నాను.

**1. సజెస్టివ్:** ఉక్క పుట్టిస్తున్నాడు. మేఘాలు, మనిషి చెమటలు కక్కడం సూచనలు.

**2. సింబాలిక్:** మండుతున్నాడు. మేఘాల నీళ్ళు ఉడుకుతున్నాయి. చిహ్నాలు, మంటలు.


**3. ఎగ్జాజిరేటెడ్ :** వేడి తట్టుకోక, సూర్యుడే గొడుగులోకి వచ్చేశాడు. ఇది అతిశయోక్తి.

**4. ఆబ్‌స్ట్రక్ట్:** సూర్యుడు ఛత్రంగా మారిపోయాడు. మేఘాలు ఆవిరవగా మనిషి కాలి బూడిదై పోయాడు. అనూహ్యం కదా!

కార్టూన్ ప్రక్రియలో, వ్యాఖ్య సహిత, వ్యాఖ్య రహిత కార్టూన్ల గురించి మనకు తెలిసిందే. వ్యాఖ్య రహిత కార్టూన్లన్నీ, పై నాలుగు అంశాలకి చెందుతాయి.

విదేశీ కార్టూనిస్టులందరూ, ఈలాంటి కార్టూన్లే గీస్తున్నారు. మన తెలుగు కార్టూనిస్టులు కూడా, అప్పుడప్పుడూ, ప్రయోగాలు చేస్తే పాఠకుడికి వెరైటీ హాస్యం అందించగలం అని నమ్ముతాను.

**-కార్టూనిస్ట్ జయదేవ్.**



# రాంపా హేపీ బర్త్‌డే!




**"క**రోనా మరోనా అంటున్న వేళలో పుట్టినరోజులు, వయసు లెక్కలు ఏంటో" అన్నారు అరవై ఎనిమిదిలో పడుతున్న రాంపా.

"నవ్వుతూ, నవ్విస్తూ, నవ్వులు పంచుతూ, పలుకళల పలుకైన మీరు తత్వం చెబుతున్నారేంటి?"

"హాస్యాలేంటి, ఆనందాలేంటి అనలేదు కదండీ."

"అన్నా, రాము హాస్యాశయం, హాస్యానందం ఆగదు కదండి."

"ఆగకూడదు! మనమున్నాము... మనసులున్నాయి... మాటలున్నాయి... ముచ్చట్లున్నాయి... వుండాలి! సాగుతుండాలి!

"స్టే హోమ్, స్టే సేఫ్ అనడంలేదా?"

"మూతికీ, ముక్కుకే కాదు నెత్తికీ మాస్కు వేసుకుని తిరుగుతూనే వున్నాను."

"అవును మీరూ, ఎక్కడా కనపడకుండా సినిమా పనిలో వున్నారట."

"అవునండీ! తెలుగు కంటికి ఓ సరదా సినిమా యివ్వాలన్న కోరిక, పిచ్చి, వ్యామోహం, ఆశ, భ్రమ వంటివన్నీ మెదడులో దూరి పీడిస్తున్నాయి కొన్నేళ్ళుగా."

"ఏ ప్రొడ్యూసరన్నా ముందుకొచ్చాడా?"

"వచ్చారు, ఒకడు డబ్బుల్లేనివాడు... డబ్బులున్నా బయటికి తీయలేనివాడు... నమ్మిన వాళ్ళ దగ్గర డబ్బులెలా లాగాలని చూసేవాడు."

"కదిలో బొమ్మల పనిలో పడి కలం కుంచె కదిలిస్తున్నారా లేదా?"

"ఆలోచనలను ఆవిరి చేయడంలేదు... ఆవిష్కరిస్తూనే వున్నాను."

"మన కార్టూనిస్టులు, హాస్యరచయితల్లో నటులున్నారు, నటులు కావాలనుకునే వాళ్ళున్నారు. మీతో కలుపుకుని."

"ఆ సమయం రానీండి."

"ఏదైనా, హాస్యానందం మీ విజయాన్ని కోరుతున్నది– All The Best!

కిషోర్ పాపం అమాయకుడు....

వాడి ఫ్రెండ్ మహేష్ (అ)మాయకుడు.

అందమైన అమ్మాయి స్వాతి చాలా తెలివిగలది.

ముసలాడైనా రొమాంటిక్ ఫెలో ఆఫీస్ మేనేజర్ ప్రసాద్.

వాడు స్వాతిని ప్రేమ వల వేస్తాడు... కిషోర్ ఆపే పనిలో ఉంటాడు.

ఆ ఆఫీసులోకి అన్నా చెల్లెళ్లు ఇద్దరుంటారు. ...

మహేష్ వాడి చెల్లెలిని ప్రేమిస్తాడు.

అందరూ ఓ పెద్ద ప్రాబ్లెమ్‌లో పడతారు.

ఆ ప్రాబ్లెమ్ నుంచి బయటపడతారా లేదా?...


**రవికిరణ్**

కలం నుండి జాలువారే ఈ...

# లక్కీఫెలో

**కామెడీ సీరియల్ జనవరి నుంచే ప్రారంభం!**





Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

నాన్నగారూ...
మీరు ఇంకా ఎన్నో పుట్టినరోజులు
గడుపుకోవాలి... మీ అనురాగపు
వెలుగు దివ్వెలు మా పై ప్రసరింపజేయాలి

దీపావళి పుట్టిన రోజు



కె.బి.కృష్ణ,
డివిజనల్ అకౌంట్ ఆఫీసర్(వర్క్స్) గ్రేడ్-1
కథా నవలా రచయిత,
మినీ కథా రచయిత,
కథానిధి, కథా బ్రహ్మ,
కథావిశారద

✦ విన్నకోట భార్గవీ సాయికుమారి,
✦ విన్నకోట రవికుమార్- జాయిట్ ఇన్‌స్పెక్టర్
జనరల్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, విజయవాడ
✦ విన్నకోట శ్రీజ- ఇంగ్లీష్ గ్రాడ్యుయేషన్,
న్యూకాజిల్ యూనివర్శిటీ, ఇంగ్లండ్) ✦ విన్నకోట శ్రీనిజ
✦ కాకరపర్తి చెన్నకేశవ నరసింహశ్రీనివాస్- లీడ్ మేనేజర్,
మెసర్స్ శ్యాంసాంగ్ హెవీ ఇండస్ట్రీస్(ప్రై) లిమిటెడ్. నోయిడా-యు.పి
✦ కాకరపర్తి శేషారత్న మాధురి- డిజైన్ ఇంజనీర్, ఎల్ & టి ఫరిదాబాద్
✦ కాకరపర్తి రేవతి ✦ కాకరపర్తి శివరామ్
✦ శ్రీమతి సరస్వతి

Advt

Advt

మా
ఉద్దగిరి మిహల్ నందన్ కి
5వ పుట్టిన రోజు
శుభాకాంక్షలు




అమ్మ, నాన్న- దుర్గా, నాగబాలాజి






With Jaquar Taps

Best Cartoon of the Month




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548